నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 5-3-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 178 పేజీలు: 4 వెల: రూ.1/-

కేసీఆర్ జార్ఖండ్ పర్యటన విజయవంతం.. 'దేశ్‌కీ నేత' అంటూ ఘన స్వాగతం..

హైదరాబాద్, మార్చి 4:తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జార్ఖండ్ పర్యటన విజయవంతంగా ముగిసింది. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఆయన తండ్రి శిబూ సోరెన్‌తో కేసీఆర్ భేటీ అయ్యి.. జాతీయ రాజకీయాలపై చర్చించారు. ఈ సందర్భంగా శిబూ సోరెన్ ఆశీర్వాదం తీసుకున్నారు కేసీఆర్. రాష్ట్ర ఏర్పాటుకు సహకరించిన శిబూ సోరెన్‌కు కేసీఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శాలువాతో శిబూ సోరెన్‌తో పాటు హేమంత్ సోరెన్‌ను సత్కరించారు. అనంతరం హేమంత్ సోరెన్‌తో కేసీఆర్ ప్రస్తుతం దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఇద్దరు సీఎంలు కలిసి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సరైన దిశలో నడవడం లేదు.. దాన్ని సరి చేయాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు.

ఈ నేపథ్యంలో పలువురి నేతల్ని కలవడం జరుగుతోంది. కొత్త పంథాలో.. కొత్త విధానంలో దేశాన్ని నడిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని కేసీఆర్ తెలిపారు. కాగా, సీఎం కేసీఆర్ శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి జార్ఖండ్ రాజధాని రాంచీకి చేరుకున్నారు. అక్కడ కేసీఆర్‌కు ఘనస్వాగతం లభించింది. రాంచీలో పలు చోట్ల కేసీఆర్ బ్యానర్లు ప్రదర్శించి.. ఇలాంటి నాయకుడు దేశానికి అవసరమని పేర్కొన్నారు. రాంచీ ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా గిరిజన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా విగ్రహం వద్దకు చేరుకుని, పూలమాల వేసి నివాళులర్పించారు.

పాకిస్థాన్‌లో భారీ పేలుడు : 30మంది మృతి

న్యూఢిల్లీ, మార్చి 4:పాకిస్థాన్‌లో ఈరోజు భారీ పేలుడు ఘటన జరిగింది. పెషావర్‌లోని ఓ మసీదులో జరిగిన పేలుడులో 30 మంది మరణించినట్లు తెలుస్తోంది. సూసైడ్ అటాక్ జరిగినట్లు అనుమానిస్తున్నారు. లేడీ రీడింగ్ హాస్పిటల్‌కు చెందిన అధికారులు మృతదేహాలను గుర్తిస్తున్నారు.

ఈ ఘటనలో మరో 50 మంది గాయపడినట్లు తెలుస్తోంది. పెషావర్ సిటీ పోలీసు ఆఫీసర్ ఇజాజ్ అషాన్ మాట్లాడుతూ తాజా పేలుడులో ఓ పోలీసు అధికారి మృతిచెందినట్లు చెప్పారు. 30 మృతదేహాలను హాస్పిటల్‌కు తీసుకువచ్చినట్లు లేడీ రీడింగ్ హాస్పిటల్ మేనేజర్ అసిమ్ ఖాన్ తెలిపారు. మసీదులో జరిగిన ఆత్మాహుతి దాడిని పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఖండించారు. గాయపడ్డ వారికి చికిత్స ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. సంబంధిత అధికారుల నుంచి పేలుడు ఘటనకు చెందిన నివేదికను ఆయన కోరారు.

ఉద్యోగుల పరస్పర బదిలీలకు 15వ తేదీలోగా దరఖాస్తులు పంపుకోవాలి: సీఎస్

హైదరాబాద్, మార్చి 4:ఉద్యోగుల పరస్పర బదిలీలకు గాను ఈ నెల 15 తేదీలోగా దరఖా స్తులు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ తెలిపారు. ఈ బదిలీలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో సీనియారిటీ ప్రొటెక్షన్ ను కల్పించడం జరుగుతుందని సీ.ఎస్. స్పష్టం చేశారు. ఈ బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను ఇప్పటికే జీ.ఓ ఎం.ఎస్. నెంబర్ 21 తేదీ 2 .2 . 2022 విడుదల చేసినట్లు తెలిపారు, ఈ జీ.ఓ లోని పారా 7, 8 పారాల్లో పేర్కొన్న నిబంధనలను మార్పులు చేస్తూ ప్రభుత్వం జీ.ఓ. ఆర్.టి నెం. 402 తేదీ ,ఫిబ్రవరి 19న జారీ చేసినట్టు తెలిపారు.

తద్వారా, ఉమ్మడి జిల్లా క్యాడర్ కు చెందిన ఇద్దరు ఉద్యోగులు పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకున్నట్టయితే, వారి సీనియారిటీకి కొత్త లోకల్ కేడర్ లో కూడా రక్షణ ఉంటుందని వివరించారు. ఈ బదిలీలకై దరఖాస్తులు చేసుకునే ఉద్యోగులు ఐఎఎ ఎంఐఎస్ పోర్టల్ ద్వారా ఈ నెల 15 తేదీలోగా సమర్పించాలని అన్నారు. ఇప్పటి వరకు పరస్పర బదిలీలకై 31 దరఖాస్తులు అందాయని సోమేశ్ కుమార్ తెలిపారు.

ఆ న్యూక్లియర్ ప్లాంట్ పేలితే.. చెర్నోబిల్ కన్నా పది రెట్లు డేంజర్

న్యూఢిల్లీ, మార్చి 4: ఉక్రెయిన్‌లో ఉన్న జపోరిజియా న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌పై నిన్న దాడి జరిగింది. రష్యా జరిపిన కాల్పుల్లో ఆ ప్లాంట్‌లో మంటలు చెలరేగాయి. ప్రస్తుతం ఆ మంటల్ని ఆర్పినట్లు ఉక్రెయిన్ ఎమర్జెన్సీ సర్వీసెస్ శాఖ తెలిపింది. కానీ ఒకవేళ ఆ అణు కేంద్రం పేలి ఉంటే పరిస్థితి ఎంత భయానకంగా ఉండేదో అర్థం కావడం లేదు. జపోరిజియా న్యూక్లియర్ ప్లాంట్ యూరోప్‌లోనే పెద్ద అణు విద్యుత్తు కేంద్రం. ఆ ప్లాంట్‌లో మొత్తం ఆరు రియాక్టర్లు ఉన్నాయి. ఒకవేళ ఆ ప్లాంట్‌లో పేలుడు జరిగితే, దాని ప్రభావం చెర్నోబిల్ ఘటన కన్నా పది రెట్లు ఎక్కువగా ఉంటుందని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి డిమిట్రో కులేబా తెలిపారు.

గురువారం జరిగిన ఫైరింగ్‌లో ప్లాంట్‌లోని ఓ రియాక్టర్ వద్ద మంటలు వ్యాపించాయి. ఆ ఘటన తర్వాత అంతర్జాతీయ అణు శక్తి ఏజెన్సీ, అమెరికా ప్రభుత్వం ఉక్రెయిన్ అధికారులతో టచ్‌లో ఉంది. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. ఒకవేళ మంటల్ని ఆర్పకుంటే అప్పుడు ఆ అణు కేంద్రం పూర్తిగా ధ్వంసం అవుతుందని హార్వర్డ్ యూనివర్సిటీ న్యూక్లియర్ సెక్యూర్టీ ఎక్స్‌పర్ట్ గ్రహమ్ అలిసన్ తెలిపారు. అదే కనుక జరిగితే కొన్నేళ్ల పాటు ఆ ప్రాంతంలో రేడియో యాక్టివిటీ ఉంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 1986లో జరిగిన చెర్నోబిల్ విషాదం తరహాలోనే ఉంటుందన్నారు. చెర్నోబిల్ న్యూక్లియర్ ప్లాంట్ కూడా ఉక్రెయిన్‌లోనే ఉన్నది.

జపోరిజియా న్యూక్లియర్ ప్లాంట్‌లో ప్రస్తుతం మరమ్మత్తులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ న్యూక్లియర్ ఫ్యూయల్ తక్కువగా ఉండి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. సమీప ప్రాంతాలకు ఈ ప్లాంట్ నుంచే విద్యుత్తు శక్తి అందుతుంది. అందుకే రష్యా దళాలు ఆ ప్లాంట్‌ను మూసివేయాలని భావించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ ప్లాంట్ వద్ద రేడియేషన్ లెవల్స్ లో మార్పులేదని శాస్త్రవేత్తలు తెలిపారు. జపోరియా అణు కేంద్రం.. ఉక్రెయిన్ దేశానికి నాలుగో వంతు విద్యుత్తును అందిస్తోంది. అతిపెద్ద అణు కేంద్రం మంటల్లో ఉన్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. తన ట్విట్టర్‌లో వీడియో పోస్టు చేసిన జెలెన్‌స్కీ.. రష్యన్లు కావాలనే ఆ ప్లాంట్‌పై ఫైరింగ్ జరిపినట్లు తెలిపారు. యూరోప్ ప్రజలారా మేల్కోండి.. రష్యా బలగాలు న్యూక్లియర్ ప్లాంట్‌ను షూట్ చేసినట్లు మీ రాజకీయ నేతలకు చెప్పాలంటూ తన వీడియోలో జెలెన్‌స్కీ కోరారు.

కొత్త పంథాలో.. కొత్త విధానంలో దేశాన్ని నడపాలి : సీఎం కేసీఆర్

రాంచీ, మార్చి 4: దేశానికి ఇప్పుడు కొత్త దిశానిర్దేశం కావాలి.. భారత్‌ను సరైన దిశలో తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌తో సమావేశం అనంతరం సీఎం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి శిబూ సోరెన్‌తో మంచి అనుబంధం ఉంది. తెలంగాణ ఉద్యమానికి శిబూ సోరెన్ ఎన్నోసార్లు మద్దతు పలికారు. రాష్ట్ర ఏర్పాటుకు సహకరించారు. ఇవాళ శిబూ సోరెన్ ఆశీర్వాదం తీసుకున్నాను. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు అని కేసీఆర్ తెలిపారు.

దేశంలో ప్రత్యామ్నాయంపై త్వరలోనే నిర్ణయం

కేంద్ర ప్రభుత్వం సరైన దిశలో నడవడం లేదు.. దాన్ని సరి చేయాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ఈ నేపథ్యంలో పలువురి నేతల్ని కలవడం జరుగుతోంది. కొత్త పంథాలో.. కొత్త విధానంలో దేశాన్ని నడిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని కేసీఆర్ తెలిపారు. యాంటీ బీజేపీ ఫ్రంట్ సాగిస్తున్నారా అని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. భారత్‌ను సరైన మార్గంలో తీసుకువెళ్లేందుకు ప్రయత్నాలు జరగాలని.. ఆ దిశలో ప్రయత్నాలు జరుగుతున్నాయని సీఎం స్పష్టం చేశారు. ఎటువంటి ఫ్రంట్ లేదని, ఏర్పడబోయే ఫ్రంట్ మున్ముందు తెలుస్తుందన్నారు. 75 ఏండ్లలో ఆశించిన రీతిలో దేశం వృద్ధి చెందలేదన్నారు.. అచ్చే భారత్ విషయంలో మీ తోడ్పాటు కూడా అవసరమన్నారు.. అచ్చే భారత్, ప్రస్తుతం ఉన్న భారత్ కన్నా మెరుగైన దేశాన్ని సృష్టించాలన్నారు. అన్ని రంగాల్లో .. వివిధ నేతలు దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. మున్ముందు మరిన్ని విషయాలు వెల్లడించనున్నట్లు తెలిపారు. కాస్త ఓపిగ్గా ఉంటే.. మున్ముందు విపులంగా విషయాలను వెల్లడిస్తానని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం..

గల్వాన్ మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తామని నాడు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామని కేసీఆర్ తెలిపారు. ఇవాళ జార్ఖండ్‌లో రెండు కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాం. గల్వాన్ కాల్పుల్లో మరణించిన కల్నల్ సంతోష్ మా తెలంగాణ బిడ్డే. ఆ కుటుంబంతో మిగతా అమరుల కుటుంబాలకు కూడా సాయం చేస్తున్నామని కేసీఆర్ తెలిపారు.

ఆ ప్లాంట్ పేలితే యూరోప్‌కి యుగాంతం : జెలెన్‌స్కీ

కీవ్, మార్చి 4: : ఉక్రెయిన్‌లోని జపొరిజ్జియా అణు విద్యుత్తు కర్మాగారం పేలితే, యూరోప్ అంతమవుతుందని ఆ దేశాధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ హెచ్చరించారు. రష్యా దళాలు ఈ ప్లాంట్‌పై బాంబులు కురిపించిన వెంటనే ఆయన అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్ దేశాల అధినేతలకు టెలిఫోన్ ద్వారా ఈ వివరాలను తెలిపారు. అంతర్జాతీయ అణు శక్తి సంస్థకు కూడా ఈ దాడి గురించి వివరించారు.

ఆఫ్‌లైన్ రియాక్టర్‌పై...యూరోప్‌లో అతి పెద్ద అణు విద్యుత్తు కర్మాగారం జపొరిజ్జియా న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌పై శుక్రవారం రష్యా దళాలు బాంబులు కురిపించాయి. దీనిలో ఆరు రియాక్టర్లు ఉన్నాయి. వీటిలో ఒకదానిలో కార్యకలాపాలు జరగడం లేదు. ఆఫ్‌లైన్‌లో ఉంది. దీనిని ఆధునికీకరిస్తున్నారు. అయితే దానిలో న్యూక్లియర్ ఫ్యూయల్ ఉంది. రష్యా దళాలు ప్రయోగించిన బాంబులు దీనిపైనే పడ్డాయి. వెంటనే పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో సెంట్రల్ యూరోప్ దాదాపు దశాబ్దాల పాటు మహా విపత్తును ఎదుర్కొనబోతోందనే భయం వ్యాపించింది. ఈ మంటలను ఆర్పేసినట్లు ఉక్రెయిన్ అధికారులు ప్రకటించడంతో కాస్త ఉపశమనం దొరికింది.

ఈ ప్లాంట్ అధికార ప్రతినిధి ఆండ్రియ్ టుజ్ ఉక్రెయిన్ టెలివిజన్‌తో మాట్లాడుతూ, రష్యా దళాలు ప్రయోగించిన బాంబులు నేరుగా తమ ప్లాంటుపై పడ్డాయన్నారు. దీనిలో ఆరు రియాక్టర్లు ఉన్నాయని, ప్రస్తుతం కార్యకలాపాలు జరగని, ఆధునికీకరణ పనులు జరుగుతున్న రియాక్టర్‌పై బాంబులు పడ్డాయని చెప్పారు.

ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, జపాన్ ప్రధాన మంత్రి ఫుమియో కిషిడ, యూరోపియన్ యూనియన్ నేతలు, ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీలతో జెలెన్‌స్కీ మాట్లాడారు. రష్యాపై మరిన్ని కఠినమైన ఆంక్షలను విధించాలని కోరారు. జపొరిజ్జియా ప్లాంట్‌పై రష్యా దళాల దాడుల తర్వాత యూరోప్ మహా విపత్తును ఎదుర్కొనబోతోందని చెప్పారు. ఈ ప్లాంట్‌లో పేలుడు జరిగితే ప్రతి ఒక్కరికీ అదే అంతిమ ఘడియ అవుతుందని చెప్పారు. యూరోప్ ఖాళీ అవుతుందన్నారు. యూరోప్ అత్యవసరంగా చర్యలు చేపడితేనే రష్యా దళాలను ఆపగలమని చెప్పారు. అణు విద్యుత్తు కర్మాగారంలో విపత్తు వల్ల యూరోప్ అంతమవడానికి అవకాశం ఇవ్వకూడదని తెలిపారు.

రష్యా దళాలను ఆపడం కోసం రష్యా అధినాయకత్వంపై ఒత్తిడి తేవాలని రాజకీయ నేతలను, ప్రజలను కోరారు.

రష్యాపై ఔయీ ఆగ్రహంఉక్రెయిన్‌లోని న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌పై బాంబులు కురిపించిన రష్యాపై నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (ఔయీ) చీఫ్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది నిర్లక్ష్యపూరిత చర్య అని దుయ్యబట్టారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని తక్షణమే ఆపాలని రష్యాను డిమాండ్ చేశారు. ఈ ప్లాంట్ ప్రాంతంలో యుద్ధాన్ని తక్షణమే ఆపాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధాన మంత్రి బోరిస్ జాన్సన్, మరికొందరు నేతలు రష్యాను కోరారు.

రేడియేషన్ లెవెల్స్‌లో మార్పు లేదుఉక్రెయిన్ స్టేట్ న్యూక్లియర్ రెగ్యులేటర్ శుక్రవారం ఫేస్‌బుక్ పోస్ట్‌లో తెలిపిన వివరాల ప్రకారం, ఎనర్హోడార్ నగరంలోని జపొరిజ్జియా న్యూక్లియర్ పవర్ ప్లాంటుపై రష్యన్ దళాలు జరిపిన దాడిలో చెలరేగిన మంటలను ఆర్పేశారు. రేడియేషన్ లెవెల్స్‌లో మార్పులు ప్రస్తుతానికి నమోదు కాలేదు.

ఒకటో రియాక్టర్ కంపార్ట్‌మెంట్‌కు జరిగిన ఇతర నష్టాల గురించి అధ్యయనం జరుగుతోంది. యుద్ధం వల్ల ఈ ప్లాంటుకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతే, చల్లబరచే వ్యవస్థలకు విద్యుత్తును అందజేయడం కోసం డీజిల్ జనరేటర్లపై ఆధారపడవలసి వస్తుంది.

ఈ వ్యవస్థలు విఫలమైతే జపాన్‌లోని ఈబీఎబీబష్టతిఎజీ ప్లాంటులో సంభవించిన విపత్తు వంటి ఘోరం తప్పదు.

ఈ ప్లాంట్‌లోని ట్రైనింగ్ సెంటర్‌పై రష్యన్ ప్రొజెక్టైల్ పడిందని ఐక్యరాజ్య సమితి అటామిక్ ఏజెన్సీ తెలిపింది.

అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ డైరెక్టర్ జనరల్ రఫేల్ మారియానో గ్రోసి మాట్లాడుతూ, రేడియోధార్మిక పదార్థాలేవీ విడుదల కాలేదన్నారు. అగ్ని ప్రమాదం వల్ల ఇద్దరు గాయపడినట్లు చెప్పారు.

కట్టుదిట్టమైన భద్రతఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ అణు విద్యుత్తు ప్లాంటులో ఉన్న నాలుగో రియాక్టర్ వద్ద 1986 ఏప్రిల్ 26న ప్రమాదం జరిగింది. ఇది చరిత్రలో అత్యంత దారుణమైన అణు విపత్తుగా రికార్డులకు ఎక్కింది. అయితే జపొరిజ్జియా న్యూక్లియర్ పవర్ ప్లాంట్ డిజైన్ విభిన్నమైనది. అగ్ని ప్రమాదాల నుంచి దీనికి కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాట్లు ఉన్నాయి. అయినప్పటికీ ఆ ప్లాంట్ పరిసరాల్లో యుద్ధం చేయడం వల్ల దారుణమైన నష్టం జరుగుతుందని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ, అణు భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌తో ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ

రాంచీ, మార్చి 4: జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శుక్రవారం మధ్యాహ్నం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీఎం కేసీఆర్‌తో పాటు ఆయన సతీమణి శోభ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం దేశ రాజకీయాల్లో నెలకొన్న పరిస్థితులతో పాటు భవిష్యత్ రాజకీయాలపై చర్చిస్తున్నారు.

ఈ సమావేశం కంటే ముందు సీఎం కేసీఆర్ రాంచీలోని గిరిజన ఉద్యమకారుడు బిర్సా ముండా విగ్రహానికి సీఎం కేసీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. బిర్సా ముండా గిరిజన జాతికి, ఈ దేశానికి అందించిన సేవలను సీఎం కొనియాడారు.

గతేడాది గల్వాన్ లోయలో చైనా సైనికులతో జరిగిన ఘర్షణలో వీరమరణం పొందిన సైనికుల కుటుంబాలకు కేసీఆర్ ఆర్థిక సహాయం అందజేయనున్నారు. గల్వాన్‌లోయలో మరణించిన వీరజవాను కుందన్‌కుమార్ ఓఝా సతీమణి నమ్రత కుమారి, మరో వీరుడు గణేశ్ హన్సదా మాతృమూర్తి కప్రా హన్సదాలకు రూ.పది లక్షల చొప్పున చెక్కులను సీఎం కేసీఆర్ అందజేస్తారు.

రాష్ట్రానికి మరో పరిశ్రమ.. రూ.250 కోట్ల పెట్టుబడితో ఎస్3వీ కంపెనీ

హైదరాబాద్, మార్చి 4: రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు మరో సంస్థ ముందుకువచ్చింది. వైద్య పరికరాలు తయారు చేసే ఎస్3వీ వ్యాస్క్యులార్ టెక్నాలజీస్ అనే సంస్థ రాష్ట్రంలో తమ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని మంత్రి కేటీఆర్ ట్విటర్ వేదికగా ప్రకటించారు. దీన్ద్వారా సుమారు 750 మందికి ఉపాధి లభించనుందని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన వారికి అభినందనలు తెలిపారు.

'రాష్ట్రంలో వినియోగించే వైద్య పరికరాల్లో దాదాపు 78 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. స్థానికంగా ఉత్పత్తులను పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే 250 ఎకరాల్లో మెడికల్ డివైజెస్ పార్క్ ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో వైద్య పరికరాల తయారీ సంస్థ ఎస్3వీ వ్యాస్క్యులార్ టెక్నాలజీస్ రూ.250 కోట్ల పెట్టుబడితో? మెడికల్ డివైజెస్ పార్క్?లో తమ తయారీ కేంద్రం ఏర్పాటు చేయనుంది. దీన్ద్వారా ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 250 మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది' అని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

ఏప్రిల్‌లో విశాలాక్షి సాహిత్య సభ



విశాలాక్షి సాహిత్య మాసపత్రిక & మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ కథల పోటీ, డా॥ ఈదూరు సుధాకర్ స్మారక కవితల పోటీ శ్రీమతి పుప్పాల సూర్యకుమారి మినీ కథల పోటీ విజేతలకు ఏప్రిల్ నెలలో నెల్లూరులో జరిగే సాహిత్య సభలో బహుమతి ప్రధానం జరుగును. దీనితోపాటు విశాలాక్షి సాహిత్య పురస్కారాలు కూడా ప్రముఖులు అందుకోనున్నారు. తేదీ వివరాలు త్వరలో తెలియపరచగలం

పట్టణాలతో పోటీ పడుతున్న తెలంగాణ పల్లెలు : మంత్రి జగదీష్ రెడ్డి

నల్లగొండ, మార్చి 4:: అభివృద్ధిలో తెలంగాణ పల్లెలు పట్టణాలతో సరి సమానంగా పోటీ పడుతున్నాయని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.

తద్వారా యావత్ భారతదేశంలోనే తెలంగాణ పల్లెలు నెంబర్ వన్ స్థాయికి చేరుకున్నాయన్నారు. శుక్రవారం జరిగిన నల్లగొండ జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు.

కరోనా సమయంలోనూ అభివృద్ధి,సంక్షేమం కార్యక్రమాలకు అవరోధం లేకుండా పరుగులు పెట్టించిన నేత ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆయన కొనియాడారు.

ఆర్థిక పరిపుష్టిలోనూ తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు.

దేశ సగటు ఆదాయం కంటే రాష్ట్ర తలసరి ఆదయమే ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీలు కోటిరెడ్డి,అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు యన్.భాస్కర్ రావు,రవీంద్ర నాయక్,నోముల భగత్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం

క॥ శివరాజుడో, సవరబాలా
నవిరళమగు కృషిని సతతమ్ యందరి కొరకై
"శివరాజ్‌సింగ్ చౌహాన్"
ప్రజలకు సేవలు సాగించి రాణించుచున్ !!

(మార్చి 5 మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ జయంతి..)

–రాధశ్రీ
సెల్: 9494481210

శ్రీరస్తు ! శుభమస్తు !!

ఆహ్వానము

జాతీయ తెలుగు సాహితీ పీఠము

(ఇ. నెం.9-9-144, రెడ్డి కాలని, చంపాపేట్, హైదరాబాద్, సెల్ : 9848898515)

ఆధ్వర్యంలో

తేది : 05-03-2022 శనివారము రోజున సా॥ 5.00 గం॥లకు

స్థలము : శ్రీ త్యాగరాయ గాన సభ మెయిన్ హాల్, చిక్కడపల్లి, హైదరాబాద్.

డా॥ నలవోలు నరసింహా రెడ్డి గారిచే వ్రాయబడిన

ముద్దుబాల శతకాలు 6వ,7వ, 8వ భాగముల ఆవిష్కరణ

సభాధ్యక్షులు :
ఆచార్య వెలుదండ నిత్యానందం గారు
(తెలుగు శాఖాధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం)

ముఖ్య అతిథి : గ్రంథావిష్కర్త
డా॥ కంది శంకరయ్య గారు
ప్రముఖ అవధాని, సమస్యాపృచ్ఛక చక్రవర్తి

గ్రంథ సమీక్షకులు :
డా॥ బి. జయ రాములు గారు
మాజీ డీన్ ఓరియెంటల్ కళాశాల
డా॥ తూరుపు మల్లారెడ్డి గారు
మాజీ ప్రధానచార్యులు
శ్రీలక్ష్మీ నరసింహా డిగ్రీ కళాశాల, భువనగిరి

ఆత్మీయ అతిథులు :
డా॥ రాధాశ్రీ గారు
శ్రీమతి రావూరి పనజ గారు
డా॥ శ్రీమతి టి. శ్రీలక్ష్మీ గారు

కార్యక్రమ నిర్వహణ :
మోహన్ కుమార్ గాంధీ గారు
ప్రముఖ వ్యాఖ్యాత

కార్యదర్శులు :
శ్రీ రంగరాజు మధుసూదన్ రావు గారు
శ్రీ కందుల శ్రీనివాస రావు గారు

కోశాధికారి :
శ్రీ కందగట్ల స్వామి గారు

అధ్యక్షులు :
డా॥ నలవోలు నరసింహా రెడ్డి గారు

ఆరోగ్యకర భూగోళమే ప్రాణికోటికి సౌభాగ్యాల వరం

('ఇంటర్‌గవర్నమెంటల్ పానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్' తాజాగా విడుదల చేసిన నివేదిక ఆధారంగా)

మానవ ప్రేరేపిత అనాలోచిత విశృంఖల చర్యల కారణంగా ప్రమాదకర వాతావరణ మార్పులు జరిగి ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల ప్రజల జీవితాలు ప్రభావితం కానున్నాయని 'ఇంటర్‌గవర్నమెంటల్ పానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్, ఐపిసిసి' తాజాగా విడుదల చేసిన 6వ అసెస్‌మెంట్ రిపోర్ట్ హెచ్చరికలు చేస్తున్నది. ప్రపంచ దేశాలు సత్వరమే తగు చర్యలు చేపట్టని యెడల రాబోయే రోజుల్లో అతి తీవ్రమైన వాతావరణ దుష్ప్రభావాలను ఎదుర్కోవలసి వస్తుందని నివేదిక స్పష్టం చేస్తున్నది. వాతావరణ ప్రతికూల మార్పులు జరిగినపుడు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ సమతుల్యత, భూగోళ సహజత్వం పట్టు తప్పి మానవాళి సాధారణ జీవనవిధానం ప్రశ్నార్థకం కానుందని పలు దేశాల పానెల్ సభ్యులు వివరిస్తున్నారు. వాతావరణ ప్రతికూలతలను తగ్గించడానికి ప్రపంచ దేశాలన్నీ ఐక్యతతో తగు చర్యలు తీసుకోవలసిన అగత్యం ఏర్పడింది. ఇలాంటి పరిస్థితులే ఇక ముందు కూడా కొనసాగితే రానున్న రెండు దశాబ్దాలలో భూతాపం 1.5 – 2.0 డిగ్రీ సెల్సియస్ పెరుగుతుందనే భయంకర కోలుకోలేని దుష్ప్రభావాలు మానవాళిని వెంటాడుతాయనే వాస్తవాన్ని వెల్లడించింది.

ఐపిసిసి విడుదల చేసిన 'క్లైమేట్ ఛేంజ్ 2022 : ఇంపాక్ట్ (ప్రభావం), అడాప్టేషన్ (అనుసరణ), వల్నరబిలిటీ (దుర్బలత్వం)' నివేదికను 195 దేశాల సభ్యులు ఆమోదించి, పలు శాస్త్రీయ సూచనలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన అతి పెద్ద విశ్లేషణలో ఐపిసిసి అధ్యయనంలో 67 దేశాలకు చెందిన 270 పర్యావరణ శాస్త్రజ్ఞులు, 675 మంది పర్యావరణ హితవరులు, 34,000 రెఫరెన్సులు, 62,418 మంది రివ్యూ కామెంట్స్ సేకరించారు. అనాలోచిత, స్వార్థపూరిత మానవ ప్రేరేపిత చర్యలతో వేడి గాలి తరంగాలు (హీట్ వేవ్), కరువుకాటకాలు, వరదలు ఆసాంతం పెరిగి వృక్ష జంతు జాతుల మరణాలు అధికం అవుతాయని తెలుస్తున్నది. దీనికి తోడుగా ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా ప్రాంతాల మిలియన్ల మానవాళికి తీవ్ర ఆహార కొరత, నీటి ఎద్దడి, అనారోగ్యం, ఆకలి చావులు పెరుగుతాయని నివేదిక బాంబు లాంటి వాస్తవాన్ని బహిర్గత పరిచింది. ఇలాంటి అవాంఛనీయ మార్పులను కట్టడి చేయడానికి కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, గ్రీన్ హౌజ్ వాయువులను కట్టడి చేయడం, పర్యావరణహిత ఇంధన వాడకాలను ప్రోత్సహించడం సత్వరమే చేపట్టాలి.

వాతావరణ ప్రతికూల మార్పుల వల్ల కలిగే ప్రమాదాలను సరి చేయడం మన చేతుల్లో ఉండదని మరువరాదు. ఆరోగ్యకరమైన వాతావరణ మార్పులతో జీవరాశులకు కనీస అవసరాలైన ఆహారం, నీరు, గూడు, ఆరోగ్యం సమకూరి జీవవైవిధ్యం నెలకొంటుంది. మానవులు తమ పూర్వ ఆలోచనలకు స్వస్తి పలికి, వాతావరణ హిత సుస్థిరాభివృద్ధి మార్గాల్లో నడవాల్సి ఉంటుందని ఐరాస కూడా పట్టుబడుతోంది. పట్టణీకరణ, సామాజిక అసమానతలు, ప్రకృతి విపత్తులు, మహమ్మారి ప్రళయాలు లాంటివి వాతావరణ మార్పులతో సన్నిహిత సంబంధాలను కలిగి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. శాస్త్రసాంకేతికతతో స్వదేశీ స్థానిక ఆలోచనలు జోడించి ముందుకు అడుగులు వేయాల్సి ఉంటుందని, లేని యెడల భవిష్యత్తు అంధకారం అవుతుందని హెచ్చరిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా 50 శాతానికి పైగా జనాభా నగరాలలో ఉండడంతో నగర వాతావరణ మార్పుల ప్రభావం, అనుసరణ, దుర్బలత్వాలను అంచనా వేయాల్సి ఉంటుంది. ప్రతికూల వాతావరణ మార్పులతో హీట్ వేవ్, తుఫానులు, కరువులు, వరదలు, సముద్ర మట్టాలు పెరిగితే మానవ జీవితాలు, జీవనోపాధి, ఆరోగ్యం, మౌళిక వనరులు, స్థిరాస్తులు, ఇంధన లభ్యత, ప్రజారవాణ లాంటివి ప్రభావితం అవుతూ పేదరికం, నిరుద్యోగం రాజ్యమేలుతాయి. వాతావరణ ప్రతికూల మార్పుల నియంత్రణకు హరిత పర్యావరణహిత గృహ నిర్మాణాలు, సురక్షిత నీటి సరఫరా, పునరుత్పాదక శక్తి వనరులు, పర్యావరణహిత ప్రజారవాణ నెలకొల్పవలసి ఉంటుంది. మానవ అనాలోచిత, స్వల్పకాలిక ప్రయోజన అవాంఛనీయ చర్యలతో ప్రకృతి విచ్ఛిన్నం, ప్రమాదకర జీవన విధానం, హరిత గృహ వాయు ఉద్గారాలు రోజురోజుకు పెరిగి మనిషి 'పెనెం లోంచి పొయ్యిలో పడుతున్నాడని' అర్థం చేసుకోవాలి. ప్రపంచ దేశాల మధ్య సమన్వయం, అవసరమైన ఆర్థిక వనరులు, సాంకేతిక పరిజ్ఞానం, రాజకీయ ధృఢ సంకల్పం, సమర్థవంతమైన భాగస్వామ్యం లాంటివి మాత్రమే వాతావరణ సానుకూల మార్పులకు దోహదపడతాయి. వాతావరణ మార్పులతో భూగ్రహంతో పాటు సహజంగానే జీవరాశులు కూడా ప్రభావితం అవుతాయి.

భూగ్రహంపై నెలకొని ఉన్న జనావాసాలకు చెందిన 3.6 బిలియన్ల ప్రజలు వాతావరణ మార్పులతో సతమతం కానున్నారు.

శాస్త్రజ్ఞులు అధ్యయనం చేరిన 976 జీవులలో 47 శాతం వాతావరణ మార్పుల కారణంగా అంతరించే ప్రమాదపు అంచున నిలిచాయని, అన్ని భూగోళ భాగాలు ఉష్ణోగ్రత పెంపుకు లోనవుతున్నాయని తేలింది. వాతావరణ సానుకూల మార్పులు దర్శించడానికి అనేక సంవత్సరాల హరిత హిత చర్యలు తీసుకోవలసి ఉంటుంది. ఆకలి చావులు, పేదరికం, నిరుద్యోగం, అసమానతలు, మానసిక ఆరోగ్య సమస్యలు, ఇతర శారీరక అనారోగ్యాలను ఓడించడానికి వాతావరణ సానుకూల మార్పులను ఆశ్రయించాల్సిందే అని విశ్వ మానవాళి నమ్మాలి.

మానవ ప్రేరేపిత దుశ్చర్యలతో ఇతర జీవరాశులు, పర్యావరణాలకు శాపంగా మారుతున్నాయని, భవిష్యత్తు తరాల ఆరోగ్యకర మనుగడకు ఆస్తిపాస్తులు మాత్రమే చాలవని, సానుకూల వాతావరణాన్ని ఇవ్వడం కూడా మన కనీస బాధ్యత అని ప్రగాఢంగా విశ్వసించాలి. వాతావరణ మార్పులతో నేల ఎడారీకరణ, అటవీ విస్తీర్ణం, పొడి నేలలు, పర్వతాలు, జీవవైవిధ్యం ప్రభావితం అవుతాయి. అన్నీ తెలిసి బుద్ధిగా నడవనపుడు, దీపం ఉండగానే ఇల్లు సర్దుకోనపుడు, చేతులు కాలక ముందే ఆకులు పట్టుకోనపుడు మానవ ఉనికికే ప్రమాదం వాటిల్లడం సహజమే. ఈ అత్యంత ప్రమాదకర పరిస్థితులను గమనించి, ప్రపంచ మానవాళి వాతావరణ ఆరోగ్యాన్ని కాపాడుతూ, భవిష్యత్తు తరాలకు నివాసయోగ్య భూగ్రహాన్ని బహుకరిద్దాం, శాస్త్రజ్ఞుల హెచ్చరికలకు సమాధానాలను ఆచరణలో చూపుదాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

6200 మంది భారతీయులు ప్రత్యేక పౌర విమానాల ద్వారా ఉక్రెయిన్ నుంచి తిరిగి రాక

న్యూఢిల్లీ, మార్చి 4:ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన భారతీయ పౌరులను తిరిగి తీసుకురావడానికి భారతదేశం 'ఆపరేషన్ గంగా' పేరుతో భారీ రెస్క్యూ ఆపరేషన్‌ను ప్రారంభించింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో సన్నిహిత సమన్వయంతో, భారతీయ విద్యార్థులను వేగంగా భారతదేశానికి తిరిగి తీసుకురావడానికి అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇండియన్ ఎయిర్‌లైన్స్ తమ వనరులను వేగంగా తరలింపు ప్రక్రియలో మోహరించాయి. నలుగురు కేంద్ర మంత్రులు– శ్రీ హర్దీప్ సింగ్ పూరి, శ్రీ జ్యోతిరాదిత్య ఎం సింధియా, శ్రీ కిరణ్ రిజిజు జనరల్ (రిటైర్డ్) వి.కె. సింగ్ ఈ కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడానికి పర్యవేక్షించడానికి ఉక్రెయిన్ పక్కనే ఉన్న దేశాలకు వెళ్లారు. భారతీయ పౌర విమానాలు అలాగే భారత వైమానిక దళ విమానాలు చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులను క్రమం తప్పకుండా తిరిగి తీసుకువస్తున్నాయి.

ఫిబ్రవరి 22న ప్రారంభమైన తరలింపు ప్రక్రియ, 10 ప్రత్యేక పౌర విమానాల ద్వారా ఈ రోజు వస్తున్న 2185 మందితో సహా ఇప్పటివరకు 6200 మంది వ్యక్తులను తిరిగి తీసుకువచ్చింది. నేటి విమానాలు బుకారెస్ట్ నుంచి 5, బుడాపెస్ట్ నుంచి 2, కోసిస్ నుంచి 1 సివిలియన్ ఎయిర్‌లైన్స్ ద్వారా రైజ్నో నుంచి 2 ఉన్నాయి. అదనంగా, 3 భారత వైమానిక దళ విమానాలు ఈరోజు మార్చి 3 రాత్రి 11 గంటల నుంచి మార్చి 4 తెల్లవారుజామున ఎక్కువ మంది భారతీయులను తీసుకువస్తున్నాయి. నాలుగు వైమానిక దళ విమానాలు మార్చి 2 అర్ధరాత్రి, మార్చి 3 తెల్లవారుజామున ఇప్పటికే 798 మంది భారతీయులను తీసుకువచ్చాయి. పౌర విమానాల సంఖ్య తదుపరి రెండు రోజుల్లో 7400 మందికి పైగా ప్రత్యేక విమానాల ద్వారా తీసుకు వస్తారని భావిస్తున్నారు. రేపు 3500 మందిని, మార్చి 5న 3900 మందిని తీసుకురావాలని భావిస్తున్నారు.

సునీల్ కానుగోలుతో ఒప్పందం చేసుకున్న రాహుల్

న్యూఢిల్లీ, మార్చి 4:ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కాంగ్రెస్‌తో కలిసి పని చేయడం ఇక సాధ్యం కాదని తెలిసిపోయింది. దీంతో అతని మాజీ సహచరుడు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేయడానికి సైన్ అప్ చేశారు. వచ్చే ఏడాది జరగనున్న రాష్ట్ర ఎన్నికలతో పాటు 2023 నుంచి కాంగ్రెస్ ప్రచారాన్ని ప్లాన్ చేసే బాధ్యతను సునీల్ కానుగోలుకు అప్పగించినట్టు తెలుస్తోంది. 2024 జాతీయ ఎన్నికల విషయానికొస్తే తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ సీనియర్ లీడర్ ఒకరు మీడియాతో చెప్పారు. నరేంద్ర మోడీ బ్లాక్‌బస్టర్ 2014 ప్రచారాన్ని నిర్వహించిన బృందంలో ప్రశాంత్ కిషోర్‌తో పాటు భాగమైన కానుగోలు, కాంగ్రెస్ అధినేతలతో జరిగిన భేటీ తర్వాత ఈ కొత్త అసైన్‌మెంట్‌ను స్వీకరించినట్టు సమాచారం. కాగా, కిషోర్ సహచరుడిగా కానుగోలు గతంలో బీజేపీ, డీఎంకే, ఏఐఏడీఎంకే, అకాలీదళ్‌తో కలిసి పనిచేసిన అనుభవం ఉంది.

గత ఏడాది ఏప్రిల్–మేలో బెంగాల్ ఎన్నికల విజయం తర్వాత ప్రశాంత్ కిషోర్.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో పూర్తి–సమయ కాంగ్రెస్ పార్టీకి పనిచేయాలన్న చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అనేక మార్లు భేటీ అయిన తర్వాత ఖఐతో చర్చలు ఫల ప్రదం కాలేదు. దీంతో తమిళనాడు ఎన్నికలప్పుడు అన్నాడీఎంకేతో కలిసి పనిచేసిన సునిల్ కానుగోలును కాంగ్రెస్ సంప్రదించింది.. 2024 ఎన్నికల వ్యూహానికి అతనికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించినట్టు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

పచ్చదనంలో జిల్లా నంబర్‌వన్ ఉండాలి

–సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్

హైదరాబాద్, మార్చి 4: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాను పచ్చదనంలో రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలపాలని ముఖ్యమంత్రి ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ అన్నారు. మేడ్చల్ కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ హరీశ్ అధ్యక్షతన హరితహారం కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడుతూ నగరానికి చేరువులో ఉన్న ఈ జిల్లాలో వీలైనంత ఎక్కువ మొక్కలు నాటాలని అధికారులు ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షణ బాధ్యతలను అధికారులు, ప్రజాప్రతినిధులు తీసుకోవాలని సూచించారు.

హరితహారంను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. సమస్యలు, ఉంటే తన దృష్టికి తీసుకరావాలని, 15 రోజులలో జిల్లాలో పర్యటిస్తానని పేర్కొన్నారు. కలెక్టర్ హరీశ్, అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు ప్రతినిత్యం మానిటరింగ్ చేస్తూ, క్షేత్రస్థాయిలో పర్యటిస్తే అనుకున్న లక్ష్యానికి చేరుకుంటామని చెప్పారు. జిల్లాలోని ప్రతి మున్సిపాలిటీలో ఎకరం విస్తీర్ణంలో శాండల్ వుడ్ పార్క్‌లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జూన్‌లో హరితహారం..

జూన్‌లో నిర్వహించే హరితహారం కార్యక్రమానికి ప్రణాళికలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ హరీశ్ తెలిపారు. జిల్లాలో మరిన్ని ఆక్సిజన్ పార్క్‌ల ఏర్పాటుకు ప్రణాళికలను రూపొందిస్తామని చెప్పారు. గ్రామాలు, మున్సిపాలిటీలను పారిశ్రామికవేత్తలు దత్తత తీసుకుంటే హరితహారం కార్యక్రమాలు విజయవంతం అవుతాయని, ఆ దిశగా కసరత్తు చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆశయాలకు అనుగుణంగా పని చేసి జిల్లాను రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలుపుతామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంసన్, అటవీశాఖ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

"ఆపరేషన్ గంగా"లో భాగంగా ఉక్రెయిన్ నుండి ఢిల్లీకి చేరుకున్న 200 మంది భారతీయ విద్యార్థులు

న్యూఢిల్లీ, మార్చి 4:భారత ప్రభుత్వ ఆపరేషన్ గంగాలో భాగంగా ఉక్రెయిన్ నుండి దాదాపు 200 మంది విద్యార్థులు మరియు భారతీయ పౌరులు ఉక్రెయిన్ నుండి భారతదేశానికి సురక్షితంగా తిరిగి తీసుకురాబడ్డారు.

రసాయన మరియు ఎరువుల శాఖ సహాయ మంత్రి శ్రీ భగవంత్ ఖుబా, ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో తరలి వచ్చిన వారిని ఆహ్వానించారు. అధిక శాతం విద్యార్థులు ఉన్న ఈ ఇండిగో విమానం ఈ రోజు ఉదయం ఢిల్లీలో దిగింది.

తిరిగి వచ్చిన వారందరినీ స్వాగతిస్తూ, ఉక్రెయిన్ నుండి భారతీయులందరినీ స్వదేశానికి రప్పించేందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. విద్యార్థులకు వారి స్నేహితులు, సహోద్యోగులను కూడా త్వరలో తరలిస్తామని ఆయన అన్నారు.

భారతదేశానికి తిరిగి వచ్చి కుటుంబాలతో సమావేశమైన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విమానంలో ఉన్న ఒక యువ విద్యార్థి సంతోషంతో కన్నీళ్లతో యుద్ధ కలహాల దేశం నుండి సురక్షితంగా ఖాళీ చేయించడం అంటే మాటలు కాదు.. కానీ ఆ అద్భుతాన్ని మన దేశ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సాధ్యం చేశారు అని వ్యాఖ్యానించాడు.

ఇస్తాంబుల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఇండిగో విమానం నేడు 10.35 గంటలకు బయలుదేరింది. (ఎూ) బుధవారం ఉదయం 8.31 గంటలకు న్యూఢిల్లీకి చేరుకుంది.

ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో మరియు స్పైస్‌జెట్ కూడా ఉక్రెయిన్ పొరుగు దేశాల నుండి ఢిల్లీ మరియు ముంబైకి బహుళ విమానాలను నడుపుతున్న ఆపరేషన్ గంగా మిషన్‌లో చేరాయి.

ప్రపంచ వాణిజ్యంలో భారతదేశ వాటాను 10% పెంచాలని శ్రీ పీయూష్ గోయల్ పిలుపు

న్యూఢిల్లీ, మార్చి 4:వాణిజ్యం , పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ , జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ప్రపంచ వాణిజ్యంలో భారతదేశ వాటాను 10% పెంచాలని , జాతీయ స్థూల ఉత్పత్తిలో మన ఎగుమతుల వాటాను 25% కి చేర్చాలని పిలుపునిచ్చారు.

"ఇవి ప్రతిష్టాత్మకమైన లక్ష్యాలు, కానీ ఇవి ఆచరణ సాధ్యమైనవని భావిస్తున్నాను" అని శ్రీ గోయల్ "మేక్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్"పై బడ్జెట్ అనంతర ఆన్ లైన్ సమావేశ ముగింపు అంకంలో ప్రసంగిస్తూ అన్నారు.

ప్రధాన మంత్రి, వెబ్‌నార్ ప్రారంభ ప్రసంగంలో, తయారీని ప్రోత్సహించడానికి , భారతదేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడానికి ప్రయత్నించాలని శ్రీ గోయల్ పేర్కొన్నారు.

"నేడు ఇతర దేశాలు కూడా ఆత్మనిర్భర్ భారత్ లాంటి కార్యక్రమాల గురించి మాట్లాడుతున్నాయి, ఈ దార్శనికత ప్రాముఖ్యత , విజయాన్ని చూసి ఈ రోజు ప్రపంచం భారతదేశ కథను అనుకరించాలనుకుంటోంది అనే వాస్తవం కంటే మెరుగైన ఆమోదం మరొకటి ఉండదని నేను భావిస్తున్నాను, "అని ఆయన చెప్పారు.

ప్రపంచ సేవల వాణిజ్యంలో భారతదేశాన్ని మొదటి 3 స్థానాలలో చేర్చాలని శ్రీ గోయల్ పిలుపునిచ్చారు. భారతదేశం ఏ100(2047) దిశగా అమృత్ కాల్‌ను ప్రారంభించినందున రాబోయే 25 సంవత్సరాలలో సాంకేతికతలో అగ్రగామిగా నిలిచేందుకు ప్రపంచంలో మొదటి 10 పరిశోధన, అభివృద్ధి ల్యాబ్‌లు/ఇన్నోవేషన్ సెంటర్‌లను సృష్టించడంతోపాటు, విదేశీ వాణిజ్యంలో ఓఓఇలకు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

"మనమందరం ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలి, మనమందరం సహకార విధానంలో భారతదేశ తయారీ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేద్దాం, మనమందరం భారతదేశాన్ని ఆత్మనిర్భర్‌గా మారుద్దాం" అని ఆయన అన్నారు.

రక్షణ వ్యవస్థలను మినహాయించి డ్రోన్‌ల రంగానికి మరింత సరళమైన నియంత్రణ పాలనను ప్రభుత్వం చూస్తోందని పేర్కొన్న శ్రీ గోయల్, భారతదేశాన్ని డ్రోన్‌ల తయారీ కేంద్రంగా మార్చాలని పరిశ్రమ లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. 'పూర్తి విలువ గొలుసు'లో నాణ్యతను సమగ్రపరచాలని ఆయన పిలుపునిచ్చారు. తుది ఉత్పత్తిని తయారు చేసిన తర్వాత మాత్రమే నాణ్యత పరిగణన లోకి రాకూడదని అన్నారు.

పరిశ్రమ కోసం రేపటి సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పిన శ్రీ గోయల్, "నేటి అవసరాలకు" సంబంధితంగా ఉండేలా పాఠ్య అంశాలను మార్చాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

''చాలా తరచుగా, కాలానుగుణ అవసరాలు చాలా వేగంగా కదులుతున్నాయి, పాఠ్యాంశాల్లో మార్పు చాలా నెమ్మదిగా జరుగుతుంది, వాస్తవానికి, చాలా సమస్యలు ఉన్నాయి, మీరు రాత్రికి రాత్రే పాఠ్యాంశాలను మార్చలేరు, సమకాలీన విద్య కూడా అంతే ముఖ్యం. కాబట్టి మీకు కావాల్సిన వాటికి సంబంధించిన మరిన్ని విద్యా కోర్సులు, , దాని కోసం మేము ఈ రోజు ఏమి బోధిస్తున్నాము , అది ఎంత సమకాలీనమైనది అనే దాని గురించి కొంత పరిశోధన చేయవలసి ఉంటుంది, "అని ఆయన అన్నారు.

అంతకుముందు రోజు, వాణిజ్యం , పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిశ్రమ , అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (ఆఖఎఐ) ఏర్పాటు చేసిన వెబ్‌నార్‌లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రత్యేక ప్రసంగం చేశారు. ప్రారంభ అంకం తర్వాత, (తి) భారతదేశంలో తయారీలో సమూనా మార్పు ఏ 100, (తితి) ఎగుమతుల్లో భారతదేశం ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని సాధించడానికి వ్యూహాన్ని రూపొందించడం , (తితితి) ఓఓఇలు ఎలా పనిచేస్తాయో అన్వేషించడం కోసం భారత ఆర్థిక వ్యవస్థకు గ్రోత్ ఇంజిన్ లపై వరుసగా మూడు సెషన్‌లు జరిగాయి.. ముగింపు సెషన్‌లో ముగ్గురు సీనియర్ పరిశ్రమ నాయకులు, అంటే సెషన్ సందానకర్తలు ముందుకు వెళ్లే మార్గాలపై కార్యాచరణ ప్రణాళికలను ప్రదర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు కూడా చర్చల్లో పాల్గొన్నారు.

స్నేహితులకే బురిడీ.. కోటిన్నరకు టోకరా.. అంతరాష్ట్ర చీటర్ అరెస్ట్

కరీంనగర్ , మార్చి 4: (నేటినిజం ప్రతినిధి): నమ్మిన స్నేహితులను అడ్డంగా మోసగించి కోట్ల రూపాయలు దండుకున్న అంతరాష్ట్ర చీటర్ ను పెద్దపల్లి పోలీజులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వివరాలను పెద్దపల్లి ఏసిపి సారంగపాణి వెల్లడించారు. ఖమ్మంకు చెందిన వాసిరెడ్డి రాహుల్ సుల్తానాబాద్ కు చెందిన జక్కుల మమతను మోసగించి రూ. 15.50 లక్షల రూపాయల నగదుతో పాటు అయిదున్నర తులాల బంగారాన్ని తీసుకున్నాడని మమత ఫిర్యాదు మేరకు సుల్తానాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. మమత వివాహ సంబంధం కోసం తెలుగు మ్యాట్రిమోనీలో తన ప్రొఫైల్ పెట్టుకుందని, ప్రొఫైల్ చూసిన రాహుల్ మమతను వివాహం చేసుకుంటానని నమ్మించి చాటింగ్ మొదలు పెట్టాడన్నారు. తరచూ మమత దగ్గర నగదు తీసుకున్న తిరిగి ఇచ్చేవాడిని కొంతకాలం అనంతరం దగ్గర్నుండి వివిధ కారణాలు చెప్పి విదేశాల్లో ఉద్యోగం వస్తుందని చెప్పి 6 లక్షల రూపాయల నగదు తీసుకున్నాడన్నారు.

అనంతరం మమత కూడా అమెరికాలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఏడున్నర లక్షల రూపాయల నగదు తీసుకున్నాడన్నారు. ఇటీవల మరి కొంత నగదు కావాలని చెప్పడంతో మమత నమ్మి అయిదున్నర తులాల బంగారాన్ని ఇవ్వగా మణిపురం ఫైనాన్సో బంగారం కుదవ పెట్టి 1.30 లక్షల నగదు తీసుకున్నాడన్నారు. రాహుల్ మోసగించాడని తెలుసుకున్న మతాలు సుల్తానాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించగా రాహుల్ మోసాలు బయట పడ్డాయన్నారు. 2010లో ఖమ్మంలో, 2012లో హైదరాబాదులోని ఎల్బి నగర్ లో చీటింగ్ కేసులు నమోదయ్యాయన్నారు. ఇటీవలి కాలంలో స్నేహితుల పేరిట రుణాలు తీసుకొని నాలుగైదు నెలలపాటు ఈఎం ఐ లు కట్టి అనంతరం కిస్సులు కట్టకపోవడంతో స్నేహితులు కోట్లాది రూపాయలు కట్టాల్సి వచ్చిందన్నారు. మంగళగిరి కి చెందిన జాస్తి వెంకటేశ్వర్లు ను 50 లక్షల రూపాయలు, విజయవాడకు చెందిన బంగారి భాగ్యలక్ష్మి 1.80 లక్షలు, షేక్ కలీల్ ను 4.86 లక్షలు, నాయుడు వెంకటేష్ ను 1.20 లక్షలు, హైదరాబాదుకు చెందిన ప్రసన్న లక్ష్మిని 25 లక్షలు, ప్రకాశం కు చెందిన కరీముల్లా ను 1.45 లక్షలు, బాచు అప్పన్నను 2.5 లక్షలు, ముప్పి రాజు మణికంఠ నుండి రెండు లక్షల రూపాయలు మోసగించడన్నారు. రాహుల్ ను లోకి తీసుకోవడంతో పాటు అతని వద్ద నుండి లక్ష రూపాయల నగదు, చెక్కులు, సెల్ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రజలు ఇలాంటి మోసాలకు గురి కావద్దని జాగ్రత్తగా ఉండాలని కోరారు. నమ్మించి మోసగించిన రాహుల్ ను అదుపులోకి తీసుకొని అతడు చేసిన నేరాలను బహిర్గతం చేసిన సుల్తానాబాద్ ఇంద్రసేనారెడ్డి ఎస్ఐ ఉపేందర్ లతో పాటు సిబ్బందిని అభినందించడంతో పాటు నగదు రివార్డులు అందజేశారు.

అంబర్‌పేటలో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

హైదరాబాద్, మార్చి 4: అంబర్‌పేట నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతున్నదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు.

బాగ్‌అంబర్‌పేట డివిజన్ శారదానగర్‌లో రూ.5లక్షల వ్యయంతో చేపట్టనున్న కమ్యూనిటీహాల్ మరమ్మతు పనులను డివిజన్ కార్పొరేటర్ బి.పద్మవెంకటరెడ్డితో కలిసి గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట తదితర డివిజన్ల పరిధిలో గల అన్ని బస్తీలు, కాలనీలను అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా బస్తీలు, కాలనీల్లో రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్‌ల ఏర్పాటు, వీధి దీపాలు ఏర్పాటు, పార్కుల అభివృద్ధి వంటివి చేపట్టినట్లు తెలిపారు.

గతంలో ఎన్నడు లేని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ సుధాకర్, వాటర్‌వర్క్ ఏఈ మాజిద్, ఎలక్ట్రికల్ డీఈ వెంకటరమణారెడ్డి, టీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, డా.సులోచన తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

యాదాద్రి, మార్చి 4: యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఇవ్వాల ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం స్వస్తీవాచనంతో ఉత్సవాలను అర్చకులు ప్రారంభించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదుకల్లో ఆలయ అర్చకులు, ఈవో గీతతో పాటు పలువురు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. 11 రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి.

అఖండ జ్యోతి శోభాయాత్ర

లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా హైదరాబాద్ నుండి బయలుదేరిన అఖండ జ్యోతి శోభాయాత్రలో భువనగిరి పట్టణం లక్ష్మీ నరసింహస్వామి డిగ్రీ కాలేజ్ వద్ద జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి శోభాయాత్రను సాగనంపారు. నేటి నుంచి ఈ నెల 14 వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ నెల 28న మహాకుంభ సంప్రోక్షణ

తెలంగాణ విద్యార్థి.. ప్రపంచంతో పోటీ పడాలి

-మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి, మార్చి 4: డ్రగ్స్ వాడిన వారిపై ఉక్కు పాదం మోపాలని సీఎం కేసీఆర్ పోలీసులకు కఠినమైన ఆదేశాలు జారీచేశారని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. చదువులో తెలంగాణ విద్యార్థి ప్రపంచంతో పోటీ పడాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం ఇంగ్లిష్ విద్యను అందిస్తున్నారని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను పురస్కరించుకుని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన డ్రగ్స్, షీటీమ్స్‌పై అవగాహన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాచకొండ సీపీ మహేశ్ భగవత్, రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి మంత్రి విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అనంతరం మంత్రి సబిత మాట్లాడుతూ హైదరాబాద్‌కు బెస్టు సిటీగా, సేఫ్ సిటీగా పేరు ప్రతిష్టలు వచ్చాయని, అలాంటి నగరంలో డ్రగ్స్ లాంటి దురలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు కష్ట పడి చదువుకొని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా రాచకొండ సీపీ మాట్లాడుతూ యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే.. భవిష్యత్ పాడవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, ఎల్‌బీనగర్ డీసీపీ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీ షీ టీమ్స్ సలీమా, ఏసీపీ హరినాథ్, సతీశ్, లత, రామ సుబ్రమణ్యం, సావిత్రి, అర్చన, శివ, తదితరులు ఉన్నారు.

శ్రీవారి చెంతకు అమరావతి పరిరక్షణ సమితి.. తీర్పు అనుకూలంగా రావడంపై హర్షం..

తిరుపతి,మార్చి 4:: హైకోర్టు తీర్పు ప్రజలకు అనుకూలంగా రావడంతో అమరావతి పరిరక్షణ సమితి హర్షం వ్యక్తం చేసింది. ఇది రాష్ట్ర ప్రజల విజయమని సమితి జేఏసీ కన్వీనర్ శివారెడ్డి అన్నారు. శుక్రవారం మొక్కులు చెల్లించుకునేందుకు తిరుమలకు వచ్చారు. ఈ సందర్భంగా అలిపిరి పాదాల మండపం వద్ద తెలుగుదేశం పార్టీ, జనసేన, సీపీఐ, బీజేపీ లీడర్లు కొబ్బరికాయలు కొట్టి.. అమరావతి పరిరక్షణ సమితి నాయకులకు మద్దతు తెలిపారు. జేఏసీ కన్వీనర్ శివారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం ఒంటెత్తు పోకడలకు పోకుండా, అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయాలని కోరారు. అమరావతి అభివృద్ధి చెందితే 13 జిల్లాలు అభివృద్ధి చెందినట్లు అన్నారు. కాగా, ఈ సందర్భంగా ఇతర పార్టీల నేతలు మాట్లాడారు.

ఇండియన్ ఎంబసీ మద్దతు లేదు: ఉక్రెయిన్ ఆసుపత్రి నుంచి భారతీయుడు

న్యూఢిల్లీ, మార్చి 4:: రష్యాన్ సైనికుల దాడిలో భుజానికి బుల్లెట్ తగిలి.. తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో చికిత్స పొందుతున్న హర్‌జోత్ సింగ్ అనే వ్యక్తి ఆ దేశంలోని భారతీయ ఎంబసీపై విమర్శలు గుప్పించాడు. ఎంబసీని ఎన్ని సార్లు సంప్రదించినా, ఎంత మొర పెట్టుకున్నా ఎలాంటి సహాయం అందడం లేదని, ఇప్పుడైతే సహాయం అందించలేమంటూ ప్రతిరోజు ఒకే సమాధానం చెప్తున్నారని అతడు అన్నాడు.

తన స్నేహితులతో కలిసి ఫిబ్రవరి 27న బయటికి వెళ్తుండగా చెక్‌పాయింట్ వద్ద తాము ప్రయాణిస్తున్న క్యాబ్‌పై కాల్పులు జరిగాయని, ఆ కాల్పుల్లో ఒక బుల్లెట్ తన భుజానికి తగిలిందని హర్‌జోత్ చెప్పుకొచ్చాడు. అప్పటికే పరిస్థితిని ఊహించి తాము వెనక్కి మళ్లామని చెప్పినప్పటికీ తమ వాహనంపై బుల్లెట్ల వర్షం కురిసిందని పేర్కొన్నాడు. చాలా సమయం తర్వాత ఆసుపత్రిలో కళ్లు తెరిచానని, అప్పటి వరకు తాను బతికున్న విషయం తనకే తెలియదని అన్నాడు. తనకు బతకాలని ఉందని, భారత ప్రభుత్వం వెంటనే స్పందించాలని, కనీసం తనకు వీల్‌చైర్‌తో పాటు కొన్ని డాక్యుమెంటేషన్ లాంటి సహాయం సత్వరమే అందించాలని హర్‌జోత్ కోరాడు.

ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్‌తో హోస్ట్ కంట్రీ ఒప్పందంపై సంతకం చేసిన భారత్

న్యూఢిల్లీ, మార్చి 4:శ్రీ అశ్విని వైష్ణవ్, కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి మరియు హెచ్.ఇ. హౌలిన్ జావో, అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ (ఎంజ) సెక్రటరీ జనరల్, 3 మార్చి 2022న న్యూ ఢిల్లీలో ఎంజ యొక్క ఏరియా ఆఫీస్ ఉ ఇన్నోవేషన్ సెంటర్ స్థాపన కోసం హోస్ట్ కంట్రీ అగ్రిమెంట్ (ఊఅం)పై సంతకం చేశారు.

అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ అనేది ఐక్యరాజ్యసమితి సమాచార మరియు కమ్యూనికేషన్ టెక్నాలజీల (ఎఐలు) కోసం ప్రత్యేక ఏజెన్సీ. ఎంజ ప్రస్తుతం 193 దేశాల సభ్యత్వాన్ని కలిగి ఉంది మరియు 900 పైగా ప్రైవేట్-రంగ సంస్థలు మరియు విద్యాసంస్థలను కలిగి ఉంది.

న్యూ ఢిల్లీలోని ఎంజ యొక్క ఏరియా ఆఫీస్ మరియు ఇన్నోవేషన్ సెంటర్ దక్షిణాసియా దేశాలైన ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, ఇరాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక మరియు భారతదేశానికి సేవలను అందించగలదని భావిస్తున్నారు. హోస్ట్ కంట్రీ అగ్రిమెంట్ ఏరియా ఆఫీస్ స్థాపన మరియు కార్యకలాపాల కోసం చట్టపరమైన మరియు ఆర్థిక ఫ్రేమ్‌వర్క్‌ను అందిస్తుంది.ఏరియా ఆఫీస్‌లో ఇన్నోవేషన్ సెంటర్ కూడా ఉంటుంది. ఇది దక్షిణాసియాలో టెలికమ్యూనికేషన్ టెక్నాలజీలలో పరిశోధన మరియు అభివృద్ధికి ఊతమిస్తుందని భావిస్తున్నారు. ఇన్నోవేషన్ సెంటర్ విద్యావేత్తలు, స్టార్టప్‌లు మరియు నూఓఇలకు తమ ఆవిష్కరణలను ప్రపంచ స్థాయిలో ప్రదర్శించడానికి అవకాశాలను అందిస్తుంది. హోస్ట్ కంట్రీ ఒప్పందంపై సంతకం చేయడంతో, ఏరియా ఆఫీస్ మరియు ఇన్నోవేషన్ సెంటర్ 2022 మధ్య నాటికి పని చేయవచ్చని భావిస్తున్నారు.

స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరుగుతున్న వరల్డ్ టెలికమ్యూనికేషన్స్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ-20 (చుూం-20) సందర్భంగా జరిగిన వర్చువల్ వేడుకలో ఈ ఒప్పందంపై సంతకం చేశారు. చుూం అనేది ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీస్ (ఎఐలు) ప్రామాణీకరణకు అంకితం చేయబడిన ఎంజ యొక్క నాలుగు-సంవత్సరాల ప్రపంచ సదస్సు. 2024లో జరగనున్న తదుపరి చుూంకి ఆతిథ్యం ఇవ్వాలని భారతదేశం ప్రతిపాదించింది.

టెలికాం ప్రమాణాల అభివృద్ధికి భారతదేశం నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటోంది. భారతదేశంలో అభివృద్ధి చేయబడిన 5ఉ ప్రమాణాలు ఇప్పుడు ఎంజచే 5ఉ కోసం మూడు సాంకేతికతలలో ఒకటిగా గుర్తించబడ్డాయి. 1.2 బిలియన్ల కంటే ఎక్కువ టెలికాం సబ్‌స్క్రైబర్‌లతో, స్టార్టప్‌లు మరియు ఇన్నోవేషన్ హబ్‌ల యొక్క బలమైన పర్యావరణ వ్యవస్థ, టెలికాం ప్రమాణాలను మరింత అభివృద్ధి చేయడంలో భారతదేశం అర్థవంతంగా సహకరించడానికి సిద్ధంగా ఉంది.

భారత మొట్టమొదటి స్టార్టప్‌ను ప్రోత్సహించాలని సైన్స్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నిర్ణయం: కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, మార్చి 4:కార్బన్ ఉనికిని తగ్గించి భవన ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి తాజా డే లైట్ హార్వెస్టింగ్ టెక్నాలజీ లో ఒక ప్రత్యేకమైన స్టార్ట్-అప్ ను ప్రోత్సహించాలని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నిర్ణయించినట్లు కేంద్ర సైన్స్, టెక్నాలజీ సహాయ (స్వతంత్ర హోదా) మంత్రి, ఎర్త్ సైన్సెస్ సహాయ (స్వతంత్ర హోదా) మంత్రి , పిఎంఓ, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణు శక్తి అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

డేలైట్ హార్వెస్టింగ్ టెక్నాలజీస్ కు సంబంధించి భారతదేశం లోని ఏకైక స్టార్ట్-అప్ కంపెనీ హైదరాబాద్ లోని "స్కైషేడ్ డేలైట్స్ ప్రైవేట్ లిమిటెడ్" కోసం భారతదేశంలో ఏకైక స్టార్ట్-అప్ కంపెనీ డాక్టర్ జితేంద్ర సింగ్ సమక్షంలో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం చట్టబద్ధ సంస్థ టెక్నాలజీ డెవలప్ మెంట్ బోర్డుతో ఒక ఎమ్ఒయుపై సంతకం చేసింది.

24లీ7 ప్రాతివదికన బేస్మెంట్ విద్యుద్దీకరణ కోసం కొత్త టెక్నాలజీలను అభివృద్ధి చేయడానికి పది కోట్ల ప్రాజెక్టులో రూ.5కోట్ల ను టిడిబి స్కైషేడ్ కంపెనీకి ఇస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.ఏట్రియంలు , సోలార్ థర్మల్ టెక్నాలజీలను నిర్మించడానికి పెద్ద సైలైట్ డోమ్ ల రూపకల్పన,నిర్మాణ కార్యకలాపాలతో ప్రారంభించి మూలాలలో కంపెనీ నిమగ్నమై ఉందని ఆయన చెప్పారు.

స్టార్ట్-అప్ ఇప్పుడు మానవ కేంద్రిత-వాతావరణ అనుకూల, అన్వయిత భవన ముఖభాగాలు , సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ డే లైటింగ్ వ్యవస్థ అనే మరో రెండు సృజనాత్మక పరిష్కారాలతో ముందుకు వచ్చిందని ఆయన అన్నారు. ఈ రెండు వ్యవస్థలు పగటి పూట కొత్త క్షితిజాన్ని ఇస్తాయి . ఈ ఉత్పత్తులు సులభంగా భరించ కలిగేవి, స్వీకరించద గినవి ఇంకా ఆర్థికంగా ఆచరణీయమైనవి.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, సహజంగా పగటి పూట గదుల లోకి సహజ సూర్యకాంతి వస్తుందని, సౌర శక్తి స్పెక్ట్రమ్ 45% శక్తిని కనిపించే కాంతిగా కలిగి ఉందని, దీనిని రోజుకు సుమారు 9-11 గంటల పాటు భవన ప్రకాశానికి ఉపయోగించవచ్చని ఆయన అన్నారు.

ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానం పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానం అని, ఆర్థికంగా ఆచరణయోగ్యమైనదనీ, అమర్చడానికి సులభం తో పాటు దీర్ఘాయువుతో తక్కువ నిర్వహణ అవసరమని మంత్రి అన్నారు. అంతేకాక, ప్రతిపాదిత సాంకేతికతలు, ఒక భవనం కోసం భారీ మొత్తంలో సూర్యకాంతిని కోస్తుంది మరియు విద్యుత్ లైటింగ్ శక్తి వినియోగాన్ని 70-80% తగ్గించే కాంతిని నిర్మించడానికి అందుబాటులో ఉంచుకుంటాయి, దీనితో పాటు ఎయిర్ కండిషనింగ్ (కూలింగ్ లోడ్) వినియోగాన్ని తగ్గిస్తుందని ఆయన తెలిపారు. అంతేకాకుండా, ప్రతిపాదిత సాంకేతికతలు, ఒక భవనానికి భారీ మొత్తంలో సూర్యరశ్మిని అందిస్తాయి . భవనం కోసం వెలుతురును అందుబాటులో ఉంచుతాయి, ఇది ఎలక్ట్రికల్ లైటింగ్ శక్తి వినియోగాన్ని 70-80% తగ్గిస్తుంది, అంతేకాకుండా ఎయిర్ కండిషనింగ్ (కూలింగ్ లోడ్) వినియోగాన్ని తగ్గిస్తుందని అన్నారు.

స్కైషేడ్ డేలైట్స్ ప్రైవేట్ లిమిటెడ్ 2014 నుండి ఈ ప్రాంతంలో పనిచేస్తోందని, ప్రభుత్వ సంస్థలు, పిఎస్ యులు, కార్పొరేట్ నుండి ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా-చెన్నై, తెలంగాణ సెక్రటేరియట్, పిఎంఓ కార్యాలయం సౌత్ బ్లాక్, న్యూఢిల్లీ, ఎన్ టిపిసి, అమెజాన్, క్యాటర్ పిల్లర్, ఐకియా, మహీంద్రా, టాటా మోటార్స్ హీరో మోటార్స్, ఎయిర్ పోర్ట్ అథారిటీతో సహా యదాద్రి ఆలయం, శ్రీ రంగనాథస్వామి ఆలయం, శివాలయం, బోహ్రా మసీదు మొదలైన కొన్ని మత పరమైన నిర్మాణాల వరకు వినియోగదారుల కోసం పగటి పూట వెలుగులు నింపుతోందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. అయోధ్య ఆలయాన్ని కూడా పగలు రాత్రి వెలిగిం చేందుకు సంస్థ సిద్ధమవుతోంది.

రాజేష్ కుమార్ పాఠక్ ,టిడిబి కార్యదర్శి ఐపి అండ్ టిఎఎఫ్ఎస్ మాట్లాడుతూ, "లైటింగ్ అనేది మన రోజువారీ జీవితానికి ప్రాథమిక అవసరం అని, పగటి కాంతి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉందని, ఇది చాలా శుభ్రమైన ఖర్చు-సమర్థవంతమైన శక్తి వనరు అని అన్నారు. డే లైట్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పగటి పూట మన విద్యుత్ అవసరాలను తీర్చడం ద్వారా, 2070 నాటికి భారతదేశాన్ని నెట్ జీరో ఉద్గార దేశంగా మార్చడానికి "పంచామృత" వాగ్దానాలలో ఒకదాన్ని తీర్చడానికి ఎంతగానో దోహదపడుతుంది. ఈ ప్రత్యేక ప్రాజెక్ట్ ఒక గేమ్ ఛేంజర్ గా నిరూపితం కావచ్చని, రాబోయే సంవత్సరాల్లో పర్యావరణ స్నేహ తో కూడిన జీవన శైలి కోసం ఒక ప్రజా ఉద్యమంగా మారవచ్చని విశ్వసిస్తున్నట్టు తెలిపారు.

కార్బన్ ఉనికిని తగ్గించడానికి, భవన విద్యుత్ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి తమ టెక్నాలజీల ద్వారా డే లైట్ హార్వెస్టింగ్ కు పూర్తి పరిష్కారాన్ని కంపెనీ ప్రతిపాదించింది. గ్రీన్ అండ్ నెట్ జీరో భవనాలను సృష్టించడం, వాతావరణ మార్పులపై జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్ ఎపిసిసి) కింద జాతీయ మిషన్లలో పాల్గొనడం, సహకారం అందించడం ఈ కంపెనీ లక్ష్యం.

పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద విస్తరణ ప్రణాళికతో, భారతదేశం స్థిరమైన ఇంధన పరిష్కారాలను సార్వత్రికంగా అందుబాటు చేసుకోవడం, గణనీయమైన ఆర్థిక, పర్యావరణ ,సామాజిక ప్రభావంతో తక్కువ కార్బన్ భవిష్యత్తును ప్రారంభించడం కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

2022 చివరి నాటికి పునరుత్పాదక ఇంధన వనరుల నుండి తన ఇంధన అవసరాలలో 175 జిడబ్ల్యు సామర్థ్యాన్ని సాధించడానికి దేశం ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది, గ్లాస్గోలో జరిగిన సిఒపి26 శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని పేర్కొన్న విధంగా 2030 నాటికి 500 జిడబ్ల్యు సాధించడానికి కట్టుబడి ఉంది. వాతావరణ మార్పుల విషయం పరిశీలనకు భారత దేశ నిబద్ధతగా ఐదు అంశాల "పంచామృతం" ను భారత దేశం తరఫున శ్రీ నరేంద్ర మోదీ ప్రపంచానికి అందించారు.

ప్రభుత్వ స్కూళ్లలో కార్పొరేట్ స్థాయి విద్య: మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

దేవరుప్పుల-జనగామ జిల్లా: మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శుక్రవారం దేవరుప్పుల మండలం చిన్నమడూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన మంత్రి.. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో మాట్లాడారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో ఎంపికైన పాఠశాలలకు అవసరమైన నిధులు మంజూరు చేసున్నట్లు తెలిపారు. మన గ్రామాల్లో ఉన్న పాఠశాలలు ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సైన్యంపై తప్పుడు ప్రచారం చేస్తే 15ఏళ్ల జైలు శిక్ష.. కొత్త చట్టం చేసిన రష్యా

న్యూఢిల్లీ, మార్చి 4:రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. వరుసగా 9వ రోజూ ఉక్రెయిన్ పై బాంబుల వర్షం కురిపిస్తున్నాయి రష్యా సేనలు. ఉక్రెయిన్ కూడా అంతే దీటుగా ప్రతిఘటిస్తోంది. రష్యా బలగాలపై ఎదురు దాడి చేస్తోంది. అయితే రష్యా-ఉక్రెయిన్ల మధ్య జరుగుతున్న యుద్ధం.. ఆ వార్తల ప్రచారం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని కొత్త చట్టాలు చేస్తున్నాయి ఇరు దేశాలు. నిన్న రష్యా ఆస్తులను సీజ్ చేసుకునేందుకు ఉక్రెయిన్ పార్లమెంట్ చట్టం చేసింది. కాగా, ఇవ్వాల రష్యా కూడా అలాంటి చట్టం ఒకటి కొత్తగా తీసుకొచ్చింది. తమ సైన్యంపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలుండేలా చేసిన చట్టానికి శుక్రవారం రష్యా పార్లమెంటు ఆమోద ముద్ర వేసింది. ఈ చట్టం ప్రకారం రష్యా సాయుధ దళాలపై తప్పుడు ప్రచారం చేయడాన్ని జైలు శిక్ష విధించదగిన నేరంగా పరిగణిస్తారు.

రష్యా సైన్యంపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం వ్యాప్తి చేసిన వారికి 15 ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తారు. ఈ మేరకు రష్యా పార్లమెంటులోని దిగువ సభ ఈ చట్టానికి ఆమోద ముద్ర వేసింది. రష్యా బలగాల దాడిలో ఉక్రెయిన్ కు తీవ్ర నష్టం జరుగుతోంది. అయినప్పటికి ఉక్రెయిన్ కూడా అంతే స్థాయిలో విరుచుకుపడుతోంది. రష్యా సైన్యాన్ని, వారి యుద్ధ వాహనాలను ధ్వంసం చేస్తోంది. ఇప్పటిదాకా ఉక్రెయిన్ సైన్యం దాడిలో 9వేల 166 మంది రష్యా సైనికులు చనిపోయారని ఉక్రెయిన్ రక్షణ శాఖ వెల్లడించింది. అంతేకాదు 251 రష్యా యుద్ధ ట్యాంకులను ధ్వంసం చేశామని, 33 యుద్ధ విమానాలు, 37 హెలికాప్టర్లను కూల్చేశామని తెలిపింది. తమ దాడుల్లో రష్యాకు చెందిన 105 ఫిరంగులు, 939 సిబ్బందిని తరలించే వాహనాలు, 50 క్షిపణి లాంచర్లు, 2 పడవలు, 404 కార్లు, 60 ఇంధన ట్యాంకులు, 3 డ్రోన్లు, 18 యుద్ధ విమాన వినాశక మిసైల్ వ్యవస్థలను ధ్వంసం చేశామని ఉక్రెయిన్ రక్షణ శాఖ చెప్పింది.

అయితే ఉక్రెయిన్ పై రష్యా సేనలు దాడులను మరింత తీవ్రతరం చేశాయి. ఉక్రెయిన్ మొత్తాన్ని స్వాధీనం చేసుకోవడానికి ముందస్తుగానే అన్ని రకాలుగా ప్రణాళికలు రూపొందించుకుంది రష్యా.. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 470 క్షిపణులు ప్రయోగించినట్లు అమెరికా ఓ ప్రకటనలో తెలిపింది. వాటిలో 230 ఉక్రెయిన్ లోని మొబైల్స్ వ్యవస్థల ద్వారా, 150 రష్యా భూభాగం నుంచి, 70 బెలారస్ నుంచి, మరికొన్నింటిని నల్ల సముద్రంలోని నౌకల ద్వారా రష్యా ప్రయోగించినట్లు తెలిపింది. వాటిని ఉక్రెయిన్ లోని క్షిపణి విధ్వంసక దళాలు ఎదుర్కొనే ప్రయత్నం చేశాయని చెప్పింది.

న్యాయం, ధర్మం అమరావతి రైతుల పక్షాన ఉంది: లంకా దినకర్

అమరావతి: న్యాయం, ధర్మం అమరావతి రైతుల పక్షాన ఉందని బీజేపీ నేత లంకా దినకర్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అందుకే అమరావతి రాజధానిగా కాపాడుకోగలుగుతున్నామని చెప్పారు. ప్రజా ధనం వృధా చేస్తూ రైతుల ప్రాథమిక హక్కులు తొక్కేస్తుంటే.. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేశానని తెలిపారు. సీఆర్డీఏ చట్టం అమరావతికి రక్షణ వలయం అని చెప్పిన మాట నిజమైందని లంకా దినకర్ పేర్కొన్నారు

'ఎనర్జీ ఫార్ సస్ టేనబుల్ గ్రోథ్' పై ఏర్పాటైన వెబినార్‌ను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, మార్చి 4:'ఎనర్జీ ఫార్ సస్ టేనబుల్ గ్రోథ్' (చిరస్థాయి వృద్ధి కోసం శక్తి) పై ఏర్పాటైన ఒక వెబినార్ ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న ప్రసంగించారు. బడ్జెటు సమర్పణ అనంతరం ప్రధాన మంత్రి ప్రసంగించిన వెబినార్ ల పరంపర లో ఇది తొమ్మిదో వెబినార్.

'ఎనర్జీ ఫార్ సస్ టేనబుల్ గ్రోథ్' అనేది భారతదేశ సంప్రదాయం తో ప్రతిధ్వనించడం ఒక్కటే కాకుండా అంతకంటే అది మన భవిష్యత్తు అవసరాల ను మరియు ఆకాంక్షల ను నెరవేర్చుకోవడానికి అనుసరించవలసిన ఒక మార్గం గా కూడాను ఉంది. దీర్ఘకాలిక శక్తి వనరుల వల్లనే చిరకాల వృద్ధి అనేది సాధ్యపడుతుంది అని ఆయన అన్నారు. 2070వ సంవత్సరానికల్లా నెట్ జీరో స్థాయి కి చేరుకోవాలనే గ్లాస్గో సంకల్పాన్ని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. పర్యావరణ మిత్ర పూర్వకమైనటువంటి జీవనశైలి తో పెనవేసుకొన్న ఎల్ ఐ ఎఫ్ ఇ తాలూకు తాను చేసినటువంటి ఒక ప్రకటన ను గురించి కూడా ఈ సందర్భం లో ఆయన ప్రస్తావించారు. ఇంటర్ నేషనల్ సోలర్ అలయన్స్ వంటి ప్రపంచ స్థాయి సహకార భరిత కార్యక్రమానికి భారతదేశం నాయకత్వం వహిస్తోందని ఆయన గుర్తు కు తెచ్చారు. 500 గిగావాట్ శిలాజేతర శక్తి సామర్థ్యాన్ని, అలాగే శిలాజేతర శక్తి మాధ్యమం ద్వారా 2030వ సంవత్సరానికల్లా స్థాపిత శక్తి సామర్థ్యం లో 50 శాతం మేరకు శక్తి స్తోమత ను సంపాదించుకోవాలన్న లక్ష్యాన్ని గురించి కూడా ఆయన ప్రస్తావించారు. "భారతదేశం తన కోసం ఏ లక్ష్యాలను ఏర్పరచుకొన్నప్పటికీ, నేను వాటిని సవాళు ్ళ గా భావించడం లేదు. అంతకంటే, వాటి ని ఒక అవకాశం గా చూస్తాను. గడచిన కొన్ని సంవత్సరాలు గా భారతదేశం ఈ దృష్టి కోణం తో ముందుకు సాగిపోతున్నది. మరి ఈ సంవత్సరం బడ్జెటు లో దీనిని విధానపరమైన స్థాయి లో అంగీకరించడం జరిగింది" అని ఆయన అన్నారు. ఈ బడ్జెటు లో అధిక సామర్థ్యం కలిగినటువంటి సోలర్ మాడ్యూల్ మేన్యుఫేక్చరింగ్ కోసం 19.5 వేల కోట్ల రూపాయల ను ప్రకటించడం అనేది సోలర్ మాడ్యూల్స్, ఇంకా తత్సంబంధిత ఉత్పాదనల తయారీ మరియు పరిశోధన- అభివృద్ధి లో భారతదేశాన్ని ఒక గ్లోబల్ హబ్ గా మలచడం లో సహాయకారి అవుతుంది అని ఆయన వివరించారు.

ఇటీవలే ప్రకటించినటువంటి నేషనల్ హైడ్రోజన్ మిశన్ ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, భారతదేశం తన దగ్గర ఉన్న సమృద్ధ నవీకరణ యోగ్య శక్తి తాలూకు సత్తా ను గనుక వినియోగించుకొన్న పక్షం లో అది గ్రీన్ హైడ్రోజన్ కు హబ్ గా అవతరించగలుగుతుంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ రంగం లో కృషి చేయవలసిందని ప్రైవేటు రంగానికి ఆయన సూచించారు.

శక్తి ని నిలవ చేసేందుకు సంబంధించిన సవాలు పైన సైతం బడ్జెటు లో గణనీయమైన శ్రద్ధ తీసుకోవడం జరిగింది అని కూడా శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. "బ్యాటరీ స్వాపింగ్ పాలిసి, ఇంటర్-ఆపరబులిటీ స్టాండర్డ్ స్ కు సంబంధించి కూడా ఈ సంవత్సరం బడ్జెటు లో ఏర్పాట్ల ను చేయడం జరిగింది. వీటితో భారతదేశం లో విద్యుత్తు వాహనాల వినియోగం లో వచ్చే సమస్యలు తగ్గుతాయి" అని ఆయన అన్నారు.

శక్తి ఉత్పాదన తో పాటు గా, శక్తి ని పొదుపు గా వాడుకోవడం కూడా సస్ టేనబులిటి సాధన లో సమాన ప్రాధాన్యం కలిగినటువంటి అంశం అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. "మీరు మరింత శక్తి సమర్థమైనటువంటి ఎయర్ కండిషనర్ లను, మరింత శక్తి సమర్థమైనటువంటి హీటర్ లను, మరింత శక్తి సమర్థమైనటువంటి గీజర్ లను, మరింత శక్తి సమర్థమైనటువంటి అవన్ లను మన దేశం లో తయారు చేయడం ఎలాగన్న విషయం లో కృషి చేయాలి" అని సమావేశం లో పాలుపంచుకొన్న వారికి ఆయన ఉద్బోధించారు.

శక్తి ని సమర్థం గా వినియోగించుకొనేటటువంటి ఉత్పాదన లకు ప్రాథమ్యాన్ని ఇవ్వవలసిన అవసరాన్ని గురించి ప్రధాన మంత్రి నొక్కి చెప్తూ, ఎల్ఇడి బల్బుల వాడకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించినట్లు ఉదాహరణ గా పేర్కొన్నారు. మొదట ప్రభుత్వం ఎల్ఇడి బల్బుల ఉత్పాదన ను ప్రోత్సహించి, ఎల్ఇడి బల్బుల ధర ను తగ్గించింది. మరి 37 కోట్ల ఎల్ఇడి బల్బుల ను ఉజాలా పథకం లో భాగం గా వితరణ చేయడమైంది. దీనితో ప్రతి గంట కు 48 వేల మిలియన్ కిలో వాట్ మేర కు విద్యుత్తు ను ఆదా చేయడం సాధ్యపడింది. మరి పేద కుటుంబాల కు, మధ్య తరగతి కుటుంబాల కు ఎలక్ట్రిసిటి బిల్లుల లో ఇంచుమించు 20 వేల కోట్ల రూపాయలు మిగిలింది. దీనికి అదనం గా, వార్షిక కర్బన ఉద్గారాల లో 4 కోట్ల టన్నుల క్షీణత నమోదు అయింది. స్థానిక పాలన సంస్థ లు వీధి దీపాలను వెలిగించడం కోసమని ఎల్ఇడి బల్బుల ను ఉపయోగిస్తూ ఉండడం తో ప్రతి సంవత్సరం 6 వేల కోట్ల రూపాయలు ఆదా అవుతున్నాయి అని ఆయన తెలిపారు.

బొగ్గు ను వాయువు గా మార్చే ప్రక్రియ అనేది బొగ్గు కు ఒక స్వచ్ఛమైనటువంటి ప్రత్యామ్నాయ మార్గం గా ఉందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. దీనిని దృష్టి లో పెట్టుకొని ఈ సంవత్సరం బడ్జెటు లో కోల్ గ్యాసిఫికేశన్ కోసమని 4 ప్రయోగాత్మక పథకాల ను ప్రకటించడం జరిగింది. ఇది ఆయా ప్రాజెక్టు ల విషయం లో సాంకేతిక పరమైన మరియు ఆర్థిక పరమైన లాభదాయకత కు పూచీ పడటం తో సహాయకారి కాగలదు అని ఆయన చెప్పారు. అదే విధం గా ప్రభుత్వం పదే పదే ఇథెనాల్ మిశ్రణానికి ప్రాధాన్యాన్ని ఇస్తోందని ఆయన అన్నారు. మిశ్రణరహిత ఇంధనం కోసం అదనపు ఎక్సైజ్ సుంకాన్ని విధించడం గురించి సభికుల దృష్టి కి ప్రధాన మంత్రి తీసుకు వచ్చారు. ఇందౌర్ లో ఈమధ

అర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి...

రాజన్న సిరిసిల్ల, మార్చి 4 (నేటినిజం ప్రతినిధి): గ్రామీణ ప్రాంత ప్రజలు అర్టిసి సేవలను సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ ఆర్టిసి డిపో మేనేజర్ భూపతి రెడ్డి. గ్రామసర్పంచ్ నేతికుంట జలపతి లు అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో వేములవాడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో అవహన సదస్సు నిర్వహించారు. అర్టిసి సేవలు. కార్గో సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి అధికారులు వర్జిలాల్. శ్రీనువాస్ యాదవ్. ఉప సర్పంచి వెంకటరెడ్డి. వార్డ్ సభ్యులు పాల్గొన్నారు,

మాజీ సర్పంచ్ మృతి తీరని లోటు

-కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, మార్చి 4 (నేటినిజం ప్రతినిధి):రామన్నపేట గ్రామ మాజీ సర్పంచ్ నక్క రాములు అకాల మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. గత వారం రోజుల క్రితం గుండె పోటు తో రాములు మృతి చెందగా శుక్రవారం చందుర్తి మండల కేంద్రంలో సంతాప సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాములు1995 లో రామన్నపేట సర్పంచ్ గా పనిచేశారని అలాగే ఆయన సతీమణి జ్యోతిమండల పరిషత్ అధ్యక్షురాలిగా మండల ప్రజలకు సేవలు అందించి అందరి మన్ననలు పొందారని గుర్తు చేశారు.

అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆదేశానుసారం పార్టీ బలోపేతానికి తన వంతు కృషి ని అందించడంలో ముందుండే వాడని అలాంటి వ్యక్తి మృతి చెందడం పార్టీకి. మండల ప్రజలకు తీరని లోటన్నారు.

ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అలాగే వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ఆ దేవుడి ప్రసాదించాలని కోరారు.

జడ్పీటీసీ నాగం కుమార్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు గొట్టే ప్రభాకర్,చిలుక పెంటయ్య, పులి సత్యం,దేవస్వామి,శ్రీహరి రెడ్డి,జలపతి,మల్లేశం,చంద్రం,ఆంజనేయులు,నర్సయ్య, మల్లయ్య,జగన్ తదితరులు రాములు చిత్రపటానికి నివాళులు అర్పించారు,

తెలంగాణ ట్రెడిషనల్ ఆర్ట్స్ ఫిలిం టీవీ డిజిటల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ 5 తేదీన సమావేశం

రాజన్న సిరిసిల్ల, మార్చి 4 (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ ట్రెడిషనల్ ఆర్ట్స్ , ఫిల్మ్, టివి, డిజి టల్ డవలప్ మెంట్ అసోసి యేషన్ సిరిసిల్ల రాజన్న జిల్లా కమిటీ బాధ్యుల సమావేశం మార్చ్ 5 వ తేదీ శని వారం ఉదయం 11 గంటలకు వేములవాడ పట్ట ణంలో నృత్య కళానికేతన్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు టీటీ ఎఫ్ టి డీ జిల్లా ఇంచార్జ్, రాష్ట్ర నాయకులు యెల్లా పొచేట్టి తెలిపారు . ఈ సమావేశంలో జిల్లా సమావే శంలో ఉద్యమ ఎజెండా అంశాలు, ఉద్యమ కార్యాచ రణ, కళల పరి రక్షణ, ఉద్యమ విస్తరణ లాంటి పలు అంశాల పై చర్చిస్తామని తెలిపారు

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై చర్చ జరుగాలి : స్పీకర్ పోచారం

నిజామాబాద్, మార్చి 4:వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పద్ధతులు, అధిక లాభాలను అందించే పంటలపై చర్చ జరగాలని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కోటగిరి మండలం పోతంగల్ గ్రామంలో రూ.14 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ..వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగు చేస్తే రైతులకు మంచి లాభాలు వస్తాయన్నారు. దేశంలో అతిపెద్ద కుటుంబం రైతు కుటుంబం. 70 శాతం కుటుంబాలు రైతులవే. రైతులకు ఉపయోగపడటానికి రాష్ట్ర వ్యాప్తంగా 2,600 రైతు వేదికలను నిర్మించామన్నారు. రైతు వేదికలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్ఐసి టెక్ కాన్ క్లేవ్ 2022ను ప్రారంభించిన ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటి శాఖ సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్



న్యూఢిల్లీ, మార్చి 4:నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ ఐసి) టెక్ కాన్ క్లేవ్ 2022 ను ఏర్పాటు చేసింది."నెక్స్ట్ జెన్ టెక్నాలజీస్ ఫర్ డిజిటల్ గవర్నమెంట్" అనే ఇతివృత్తం తో ముఖ్యంగా ఇ-గవర్నెన్స్ లో వర్తించే ఎమర్జింగ్ టెక్నాలజీస్ పై ఈ కాన్ క్లేవ్ దృష్టి సారించింది, ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటి శాఖ సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్

ప్రారంభించిన ఈ సదస్సు లో ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మెయిటీ) కార్యదర్శి శ్రీ కె. రాజారామన్, మెయిటీ అదనపు కార్యదర్శి డాక్టర్ రాజేంద్ర కుమార్, ఎన్ఐసి డైరెక్టర్ జనరల్ డాక్టర్ నీతా వర్మ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కు చెందిన ఇతర అధికారులు హాజరయ్యారు.

కేంద్ర మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ ప్రసంగిస్తూ, ప్రభుత్వం లోనూ, పాలన లోనూ సాంకేతిక టెక్నాలజీని వతీసుకురావడంలో ఎన్ఐసి కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.

ప్రభుత్వానికి సాంకేతిక పరిజ్ఞాన భవిష్యత్తు కోసం అంచనా ప్రణాళిక ప్ర ఎన్ఐసి డిఎన్ఎ లో ఇమిడి ఉందని ఆయన అన్నారు.

మీటీ కార్యదర్శి శ్రీ కె. రాజారామన్ మాట్లాడుతూ, ఎన్ఐసి సృజనాత్మక ఉత్పత్తులను అభినందించారు .పౌరుల కోసం చేయగల సృజనాత్మక పని మార్గాలు, కొత్త పనులను రూపొందించడానికి ఈ సదస్సు దోహదపడుతుందని అన్నారు. ట్రాన్స్ఫార్మేటివ్ ఫ్లాగ్ షిప్ ప్రొడక్ట్, ఇఆఫీస్ కు గానూ ఎన్ఐసి టీమ్ కు ఆయన అభినందనలు తెలిపారు.

మీటీ అదనపు కార్యదర్శి డాక్టర్ రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ, డిజిటల్ ప్రభుత్వ మొత్తం దృక్పథాన్ని మార్చడం, సేవలను అంతరాయం లేకుండా, సులభంగా అందుబాటులో ఉంచడం, జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచడం ,వ్యాపారం చేయడం వంటి వాటికి పెద్ద వేదికలను నిర్మించడంలో మెయిటీ , ఎన్ఐసి నిరంతర ప్రయత్నాలు రాబోయే రోజుల్లో ఫలితాలను ఇస్తాయని పేర్కొన్నారు.

గౌరవ ప్రధాని ప్రారంభించిన డిజిటల్ ఇండియా కార్యక్రమం దేశ డిజిటల్ ప్రొఫైల్ ను మార్చిందని ఎన్ఐసీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నీతా వర్మ తన స్వాగత ప్రసంగంలో తెలిపారు.

బ్రాడ్ బ్యాండ్ నెట్ వర్క్ లు, మొబైల్ యాప్ లు, డిజిటల్ చెల్లింపులు, క్లౌడ్ స్ట్రక్చర్ వైబ్రెంట్ స్టార్ట్-అప్ ల పర్యావరణ వ్యవస్థల్లో అద్భుతమైన వృద్ధి మన చుట్టూ టెక్నాలజీ నేతృత్వ ఆవిష్కరణకు దారితీస్తున్నాయని అన్నారు.

ఎన్ఐసిలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ను పురస్కరించుకుని సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ 75 డిజిటల్ సొల్యూషన్స్ ఫ్రంఎన్ఐసి- పేరుతో ఇ బుక్ ను విడుదల చేశారు.

ఎన్ఐసి డైరెక్టర్ జనరల్ డాక్టర్ నీతా వర్మ, ఎడిట్ చేసిన "సిటిజన్ ఎంపవర్ మెంట్ త్రూ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ ఇన్ గవర్నమెంట్" అనే పుస్తకాన్ని కూడా సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ విడుదల చేశారు. ఈ పుస్తకం వివిధ రంగాల సాంకేతిక నేతృత్వ మార్పు,,పాన్ ఇండియా డిజిటల్ మౌలిక సదుపాయాలు ,సేవలపై పనిచేసే ఎన్ఐసి అధికారుల దృక్పథం నుంచి సమర్పించిన వాటి పరిణామాన్ని వివరిస్తుంది.

పెర్సిస్టెంట్ సిస్టమ్స్ వ్యవస్థాపక ఛైర్మన్ ,మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆనంద్ దేశ్ పాండే డిజిటల్ ప్రభుత్వం కోసం నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీస్ పై కీలకోపన్యాసం చేశారు. నానో పారిశ్రామిక వేత్త భావనపై దృష్టి సారించాల్సిన అవసరం గురించి ఆయన మాట్లాడారు.డేటా ఉ మెషిన్ లెర్నింగ్, అప్లికేషన్లు -ఏ పి ఐ లు, మెటావర్స్, వెబ్3 , క్రిప్టో ,సెక్యూరిటీ -గోప్యత మొదలైనవి రాబోయే కాలంలో పెట్టుబడి పెట్టడానికి, అభివృద్ధి చేయగల సాంకేతికత లని ఆయన అన్నారు.

సిస్కో ఇండియా, సార్క్ ప్రెసిడెంట్ శ్రీమతి దైసీ చిట్లపిల్లే తన కీలకోపన్యాసంలో, టెక్నాలజీ భారతదేశం గొప్ప మిత్రుడని అన్నారు. పని నమూనాలు పునర్నిర్వచించబడుతున్న, కొత్త వ్యాపార నమూనాలు పునఃరూపకల్పన జరుగుతున్న సమయం లో.టెక్నాలజీని మరింత మంచి , సమ్మిళిత వృద్ధికి ఉపయోగించవచ్చునని అన్నారు.

ఎన్ఐసి టెక్ కాన్ క్లేవ్ -2022 తాజా ఐసిటి టెక్నాలజీల పైన, ఇంకా అత్యాధునిక టెక్నాలజీలు , పరిశ్రమ ఉత్తమ విధానాలపై వాటి ఉపయోగ కేసులపై మంత్రిత్వ శాఖలు/విభాగాల ఐటి మేనేజర్లను సుసంపన్నం చేస్తుంది. రాష్ట్రాల్లో అమలు చేయగల కొత్త టెక్నాలజీలు , అనువర్తనాలను మరింత మెరుగ్గా తెలుసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాల ఐటి కార్యదర్శులకు ఇది ఒక వేదికను అందిస్తుంది. ఇది పరిశ్రమ, ప్రభుత్వ ఐటి నిర్వాహకుల మధ్య అనుసంధానం ఏర్పరుస్తుంది. ప్రత్యేకించి దేశవ్యాప్తంగా

ప్రభుత్వ పని తీరు లో సామ ర్థ్యాన్ని పెంపొందించడానికి ఎంతో తోడ్పడుతుంది, పౌరులకు సేవలను అత్యున్నత ప్రమాణాలతో అందించడానికి సహాయకారిగా నిలుస్తుంది.

అద్భుతమైన పాలనతో ఆదర్శంగా నిలిచాం : మంత్రి వేముల

నిజామాబాద్, మార్చి 4: సీఎం కేసీఆర్ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, జనరంజక పాలనతో నేడు తెలంగాణ పల్లెలు ఆర్థికంగా పరిపుష్టంగా మారాయని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో కరాష్ట్ర తలసరి ఆదాయం 2014లో రూ.5లక్షల కోట్లు ఉంటే నేడు రూ.11 లక్షల కోట్ల వృద్ధికి చేరుకుందని చెప్పారు.

రాష్ట్ర తలసరి ఆదాయం 130శాతం పెరిగిందన్నారు. రాష్ట్ర పౌరుని వ్యక్తిగత తలసరి ఆదాయం 2014 లో లక్షా 28వేలు ఉంటే నేడు 2లక్షల 78వేలకు పెరిగిందన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ అకుంఠిత దీక్షతో,దూర దృష్టితో గ్రామాల్లో అన్ని కుల వృత్తులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం, రైతులకు పెట్టుబడి సాయం,24 గంటల ఉచిత కరెంట్, సకాలంలో ఎరువులు, సాగునీరు ఇవ్వడం వల్ల తెలంగాణ పల్లెలు ఆర్థికంగా బలంగా ఎదిగాయని అన్నారు.బాల్కొండ నియోజకవర్గ చరిత్ర లోనే ఎన్నడూ లేని విధంగా ముఖ్య మంత్రి కేసీఆర్ సహకారంతో నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

నియోజ కవర్గం లోని గ్రామాల్లో అంతర్గత సి.సి రోడ్ల కోసం ఈ పదిహేను రోజుల్లోనే రాష్ట్ర ప్రభు త్వం 23 కోట్ల 5 లక్షలు మంజూరు చేసి ందని చెప్పారు. కొత్తగా ఏర్ప డిన18 గ్రామ పంచాయతీలకు 3కోట్ల60 లక్షల రూపా యలు మంజూరయ్యాయని తెలిపారు.ఆయా మండలాల స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఈ పనులు త్వరగా పూర్తి చేసామన్నారు.

కళ్ల ముందు అభివృద్ధి కన్పిస్తున్నా బీజేపీ నాయకులు విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. అడిగిన వెం టనే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు బాల్కొండ నియోజకవర్గ ప్రజల తరుపున మంత్రి వేముల కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం కేసీఆర్ మహిళా బంధుగా నిలిచిపోతారు : మంత్రులు సత్యవతి, సబిత

హైదరాబాద్, మార్చి 4: మహిళల స్వావలంబన, సాధికారత కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా బంధుగా నిలిచిపోతారని మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం రవీంద్ర భారతిలో రాష్ట్ర మహిళా కమిషన్, జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, మహిళా కమిషనర్ చైర్ పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల కార్యదర్శి దివ్య దేవరాజన్, మహిళా కమిషన్ సభ్యులు, వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన మహిళలు పాల్గొన్నారు.

ప్రతి రోజు మహిళా రోజే : మంత్రి సత్యవతి రాథోడ్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఒక్క రోజే మహిళల రోజు కాదు.. ప్రతి రోజు మహిళా రోజే అని మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. మహిళ కుటుంబంలో, సమాజంలో అన్ని రకాలుగా వివిధ స్థాయిల్లో తన పాత్ర పోషిస్తుందన్నారు. గత ప్రభుత్వాల్లో మహిళలు అనుకున్న పురోగతి సాధించలేదు అని గుర్తించిన సీఎం కేసీఆర్ మహిళల కోసం తెలంగాణ రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళల రక్షణ, పోషణ కోసం అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారానే వారి అభివృద్ధి సాధ్యం అని నమ్మి ఆరోగ్య లక్ష్మి, భరోసా కేంద్రాలు, షి టీమ్స్ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల నుంచే ముందు ఆడపిల్ల గురించి ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. మహిళల అభివృద్ధిలో మమ్మల్ని భాగస్వామ్యం చేసిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. మహిళా కమిషన్ సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు బాగా పని చేస్తోంది. ఇందుకు వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. వారికి తోడుగా మనమంతా కలిసి పని చేయాలి. ఎనిమిది మంది వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఈ సందర్భంగా సత్కరిస్తున్నందుకు, సన్మాన గ్రహీతలకు మంత్రి సత్యవతి రాథోడ్ అభినందనలు తెలిపారు.

మహిళల భద్రత కోసం పెద్ద పీట : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.. అమ్మాయిలకు శుభాశీస్సులు తెలిపారు మంత్రి సబితా ఇంద్రారెడ్డి. సమాజంలో సగ భాగం మహిళలు అని వారి కోసం ఈ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి వారి అమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి. అమ్మ,అమ్మమ్మకు మించిన రోల్ మోడల్ సమాజంలో ఇంకెవరు ఉండరని ఆమె అన్నారు. మహిళలు అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారు అని సీఎం కేసీఆర్ నమ్మి అనేక అవకాశాలు కల్పిస్తున్నారని మంత్రి తెలిపారు. మహిళల భద్రత కోసం పెద్ద పీట వేశారు. దేశంలో మొదటి సారి ఎస్సీ, ఎస్టీ అమ్మాయిల కోసం 53 డిగ్రీ గురుకులాలు ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకుని మహిళలు ముందుకు వెళ్లాలని సబితా ఇంద్రారెడ్డి సూచించారు.

మహిళలను సమానంగా చూడాలి : సునీతా లక్ష్మారెడ్డి

మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అంటే వంటింటికి పరిమితం అనే అభిప్రాయం ఉండేది. కానీ అందరికీ సమాన అవకాశాలు కావాలి అనే ఆలోచన నుంచి పుట్టిందే ఈ మహిళా దినోత్సవం అని ఆమె పేర్కొన్నారు. మహిళలు సాధించిన విజయాలు, సాధించాల్సిన లక్ష్యాల గురించి ఈ దినోత్సవం జరుపుకుంటామని గుర్తు చేశారు. సమాజం అభివృద్ధి జరగాలంటే మహిళలు, పురుషులు సమానంగా ఉండాలి. మహిళలకు సీఎం కేసీఆర్ అన్ని రకాల అవకాశాలు కల్పిస్తున్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సునీతా లక్ష్మారెడ్డి సూచించారు.

అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగాలు..రైతులకు ఉచిత విద్యుత్ : అఖిలేష్ యాదవ్

లక్నో, మార్చి 4:: యూపీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం క్లైమాక్స్‌కు చేరింది. మార్చి 7న తుది విడత పోరు నేపథ్యంలో పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. యూపీలో యోగి ఆదిత్యానాథ్ సారథ్యంలో బీజేపీ సర్కార్‌పై ఎస్‌పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ విరుచుకుపడ్డారు. మౌలో శుక్రవారం జరిగిన ర్యాలీలో అఖిలేష్ మాట్లాడుతూ కాషాయ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తాము దేశం గురించి మాట్లాడుతుంటే బీజేపీ రెచ్చగొట్టే ధోరణిలో వ్యాఖ్యలు చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో 11 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. యువతకు తాము ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి తీసుకువస్తామని, రైతులకు ఉచిత విద్యుత్ కల్పిస్తామని అఖిలేష్ వరాలు కురిపించారు.

ప్రధాని మోదీ నియోజకవర్గం వారణాసిలో అఖిలేష్ భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం కాశీలో మెగా రోడ్‌షోలో పాల్గొన్నారు.

ఇక కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ దళితుల ఓట్లను ఆకర్షించేందుకు వారణాసిలోని కబీర్ చౌర మఠ్‌లో మూడురోజుల పాటు మకాం వేయనున్నారు. సంత్ కబీర్ దాస్ తన జీవితమంతా కబీర్ చౌరా మఠ్‌లో గడిపారు. సంత్ కబీర్‌దాస్ సామాజిక న్యాయం, సమానత్వ నినాదాలను అందింపుచ్చుకున్న దళిత ఓటర్లను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించేలా ప్రియాంక వ్యూహాత్మకంగా ఈ నిర్ణయం తీసుకున్నారని భావిస్తున్నారు. ఏడున జరిగే ఏడో దశ పోలింగ్ 54 స్థానాల్లో జరగనుండగా ఈ ప్రాంతంలో అధికంగా బీసీలు, దళితుల ఓట్లున్నాయి.

ఈ వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పలు వరాలు ప్రకటించింది. ప్రియాంక, రాహుల్ శుక్రవారం పింద్రా జిల్లాలో భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కాశీ విశ్వనాథ ఆలయంలో ఈరోజు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇక ఫిబ్రవరి 10 నుంచి మార్చి 7 వరకూ ఏడు దశల్లో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా మార్చి 10న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు. కాగా, కుల సమీకరణలకు పెట్టింది పేరైన యూపీలో యాదవులు ఇతర ఓబీసీలు, ముస్లిం ఓట్ల మద్దతుతో అందలం ఎక్కాలని అఖిలేష్ యాదవ్ సారథ్యంలోని ఎస్పీ పావులు కదుపుతుండగా యాదవేతర ఓబీసీలు, బ్రాహ్మణులు ఇతర అగ్రకులాల అండదండలతో తిరిగి అధికారంలోకి రావాలని బీజేపీ సర్వశక్తులు ఒడ్డుతోంది. దళితుల వెన్నుదన్నుతో సత్తా చాటాలని మాయావతి సారథ్యంలోని బీఎస్పీ చెమటోడుస్తోంది.

గీత కార్మికుడు పల్లి రాజుకు బీసీ కార్పొరేషన్‌చే ఆర్థిక సహాయం

రాజన్న సిరిసిల్ల, మార్చి 4 (నేటినిజం ప్రతినిధి):రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం సనుగుల గ్రామా గీతాకార్మికుడు పల్లి రాజు గౌడ్ తాటిచెట్టు మిదికెళ్ళి పడి తీవ్ర గాయాలైనాయి హాస్పటల్ ఖర్చులనిమిత్తం 15,000 వేలుబీసీ కార్పొరేషన్ అసిస్టేంట్ జిల్లా అధికారినంపూర్ణ,నర్వాయి పావన్న వోకుదెబ్బ గౌడసంఘంరాజన్నసిరిసిల్లజిల్లా అధ్యక్షుడు తీగల శ్రావణ్ గౌడ్ వేములవాడ మండల నియోజకవర్గ అధ్యక్షుడు నాగుల రాము గౌడ్ , వేములవాడ మండల సహాయ కార్యదర్శి తీగల హరిష్ గౌడ్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు

క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయి .మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి రాజు

రాజన్న సిరిసిల్ల, మార్చి 4 (నేటినిజం ప్రతినిధి):క్రీడలుమానసికఉల్లాసానికి,శరీరక దృఢత్వానికిఎంతోదోహదపడతాయనివేములవాడ మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపుమాధవి రాజు అన్నారు .శుక్రవారంవేములవాడ ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు ప్రారంభించారు .ఈసందర్భంగా వారుమాట్లాడుతూ ఎప్పుడూ ప్రోగ్రామ్స్ తో బిజీగా ఉండే ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ వారు ఈ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించడం చాలాఅభినందనీయమని పట్టణ ప్రజలకు క్రీడా అభిమానుల కోసం ఎమ్మెల్యే రమేష్ బాబు కృషితో తిప్పాపూర్ లో మినీ స్టేడియం పనులు దాదాపు 80 శాతం పనులుపూర్తయ్యాయని త్వరలోనే మినీ స్టేడియం పనులు పూర్తి అయి అందరికీ అందుబాటులో ఉంటుందని వారన్నారు.ఈ సందర్భంగా టోర్నమెంట్ లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈకార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షులు షఫీ ,వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్ , కార్యదర్శి నాని గారు,తదితరులు పాల్గొన్నారు.

Ministry of Culture
Government of India
Azadi Ka Amrit Mahotsav

సాహిత్య అకాదెమి
మరియు
తెలుగు విభాగం,
యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, (అటానమస్)
కాకతీయ విశ్వవిద్యాలయం, సుబేదారి, వరంగల్.
Re-accredited with 'A' Grade by NAAC
సంయుక్త నిర్వహిస్తున్న
తెలంగాణ ఉద్యమ సాహిత్యం
ఒకరోజు సదస్సుకు సాహితీప్రియులందరికీ ఆహ్వానం
బుధవారం, 9 మార్చి, 2022
వేదిక : యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, సుబేదారి, వరంగల్
కార్యక్రమం
ప్రారంభ సమావేశం : ఉదయం గం॥ 9.30
స్వాగతం : ఎస్.పి. మహాలింగేశ్వర్ ప్రాంతీయ కార్యదర్శి
సభాధ్యక్షులు : బన్న అయిలయ్య కన్వీనర్ కౌన్సిల్ మెంబర్, సాహిత్య అకాడమి
ముఖ్య అతిథి : తాటికొండ రమేశ్ వైస్ చాన్సలర్, కాకతీయ విశ్వవిద్యాలయం
ప్రత్యేక అతిథి : జూలూరు గౌరీశంకర్ అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమి
సభా ప్రారంభకులు : కె. శివారెడ్డి సంచాలకులు, తెలుగు సలహా మండలి, సాహిత్య అకాడమి
కీలకోపన్యాసం : సుంకిరెడ్డి నారాయణరెడ్డి కవి, విమర్శకులు
గౌరవ అతిథి : అంపశయ్య నవీన్ సభ్యులు, తెలుగు సలహా మండలి, సాహిత్య అకాడమి
తేనీటి విరామం
మొదటి సమావేశం : ఉదయం గం॥ 11.00-1.00కు
అధ్యక్షులు : పిల్లలమర్రి రాములు / తెలంగాణ ఉద్యమ కవిత్వం
పత్ర సమర్పకులు : కరిమిళ్ళ లావణ్య / తొలిదశ తెలంగాణ ఉద్యమ సాహిత్యం
బాల శ్రీనివాసమూర్తి / తెలంగాణ మలిదశ ఉద్యమం - సాహిత్య నేపథ్యం
ఏటూరు జ్యోతి / తెలంగాణ ఉద్యమం - కవితా సంకలనాలు
భోజన విరామం
రెండవ సమావేశం : మధ్యాహ్నం 2.00-3.00కు
అధ్యక్షులు : చింతకింది కాశీం / తెలంగాణ ఉద్యమం - పాట
పత్ర సమర్పకులు : కాసుల ప్రతాపరెడ్డి / తెలంగాణ ఉద్యమం - కథ
సంగిశెట్టి శ్రీనివాస్ / తెలంగాణ ఉద్యమం - నవలలు
తేనీటి విరామం
ముగింపు సమావేశం : సాయంత్రం 3.45 కు
అధ్యక్షులు : బన్న అయిలయ్య కన్వీనర్ కౌన్సిల్ మెంబర్, సాహిత్య అకాడమి
ముఖ్య అతిథి : అల్లం నారాయణ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర మీడియ అకాడమి
ఆత్మీయ అతిథి : పంతంగి వెంకటేశ్వర్లు అధ్యక్షులు, తెలుగు శాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం
RSVP: 080-22245152 / 22130870
Email : rs.rob@sahitya-akademi.gov.in
Website : www.sahitya-akademi.gov.in

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.